RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 206 మేడ్చల్ మల్కాజ్‌గిరి 18 ఆగష్టు 2024 ఆదివారం పేజీలు : 4

## ముడా స్కాం చిక్కుల్లో సీఎం సిద్ధరామయ్య

మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్కాం కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రస్తుతం ఇబ్బందుల్లో పడ్డారు. ఆయనను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పుడు ఆయనపై కేసు నమోదు చేయనున్నారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే భూ కేటాయింపుల్లో సీఎం సిద్ధరామయ్య అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. అంతేకాదు ఈ కేసులో గవర్నర్ ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు షోకాజ్ నోటీసు పంపించారు.

# త్రిశంకు స్వర్గంలో ఆ పది మంది

## అనర్హత వేటుకై బీఆరెస్ యత్నాలు - ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఆందోళన



### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైనే భారం
### అధిష్ఠానం ఆలోచనపై అయోమయం
### పాతిక మంది చేరితేనే సేఫ్ జోన్‌లో
### ఢిల్లీ పర్యటనతోనైనా స్పష్టత వచ్చేనా?

హైదరాబాద్ : ఎన్నో ఆశలతో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆరెస్ ఎమ్మెల్యేల మెడపై ఫిరాయింపు కత్తి వేలాడుతుండటంతో వారి శాసన సభ్యత్వాల వ్యవహారం గందరగోళంలో పడింది. బీఆరెస్ నుంచి 25 మంది ఎమ్మెల్యేలు చేరితేనే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు 25 మంది వస్తారని చెబుతూ వచ్చినా.. వారి అంచనాలకు భిన్నంగా 10 మంది బీఆరెస్ ఎమ్మెల్యేల చేరికతోనే వలసలు ఆగిపోయాయి. గేట్లు తెరిచాం.. కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులు సహా సింగిల్ డిజిట్ ఎమ్మెల్యేలు మాత్రమే బీఆరెస్‌లో ఉంటారని, మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరిపోతారని సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులంతా ఊదరగొట్టారు. కానీ.. ఇప్పటికైతే 25 సంఖ్యకు దగ్గరలో కూడా లేరు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలంటూ అసెంబ్లీ స్పీకర్‌తో పాటు హైకోర్టును బీఆరెస్ ఆశ్రయించింది. హైకోర్టు ఈ కేసు విచారణను తేల్చేదిశగా సాగుతుండటంతో ఫిరాయింపు బీఆరెస్ ఎమ్మెల్యేల్లో అనర్హత గుబులు మొదలైంది. అటు మిగిలిన ఏడుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టులో సైతం కేసు దాఖలు చేయాలని బీఆరెస్ నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పులు తమకు ప్రతికూలంగా వస్తే అనవసరంగా ఉప ఎన్నికలను ఎదుర్కోవాల్సివస్తుందన్న ఆందోళన ఫిరాయింపు ఎమ్మెల్యేలను కలవరపెడుతున్నది. దీనికి తోడు ఉప ఎన్నికలు ఖాయమంటూ కేటీఆర్, హరీశ్‌రావు చేస్తున్న ప్రకటనలు సైతం ఫిరాయింపు ఎమ్మెల్యేలను భయపెడుతున్నాయి. దీంతో కాంగ్రెస్‌లో చేరిన బీఆరెస్ ఎమ్మెల్యేల్లో సైతం కొందరూ అనర్హత భయంతో ఊగిసలాడుతూ త్రిశంకు స్వర్గంలో కొనసాగుతున్నారు. రెండు పార్టీల అధిష్ఠానాలతో టచ్‌లో ఉంటున్నారు. ఇందుకు ఇటీవల అసెంబ్లీ లాబీల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు వైఖరినే నిదర్శనంగా కనిపించింది. తాము 25 మంది ఎమ్మెల్యేలు కచ్చితంగా కాంగ్రెస్‌లోకి వస్తారని భావించామని, పరిస్థితులు అలా కనిపించడం లేదని, అలాంటప్పుడు అనర్హత వేటును ఎదుర్కోక తప్పదన్న ఆందోళన ఫిరాయింపు ఎమ్మెల్యేలను పీడిస్తున్నది.

**వలసలు ఆగాయా? కొనసాగుతాయా? :** కాంగ్రెస్‌లోకి బీఆరెస్ ఎమ్మెల్యేల వలసలు ఆగినట్లేనా అంటే భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతున్న తీరుపై విశ్లేషణతోనో లేక కేసీఆర్ వలసలకు అడ్డుకట్ట వేయడంలో నిరంతరం సాగిస్తున్న ప్రయత్నాల ఫలితమో లేక కాంగ్రెస్ నుంచి సరైన హామీలు లభించకనో గానీ.. బీఆరెస్ నుంచి కొత్తగా ఎవరూ కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుకు రావడం లేదని విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్ నేతలు మాత్రం అషాఢ మాసం అడ్డురావడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నేపథ్యంలో వలసలకు విరామం పడిందని, ముగింపు కాదని చెబుతున్నారు. త్వరలోనే మరింత మంది బీఆరెస్ ఎమ్మెల్యేల వలసలు కొనసాగుతాయని ఘంటాపథంగా చెబుతున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్ తిరిగి ప్రారంభించారని, బీఆరెస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులతో పాటు చేరికలకు మొగ్గు చూపని వారిని ఆర్థికంగా ఇబ్బంది పెట్టే కార్యక్రమాలను సాగిస్తున్నారన్న ప్రచారం వినిపిస్తున్నది. రాజధాని బీఆరెస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి వేధింపు పంథా అనుసరిస్తున్నారని చెబుతున్నారు. వేధింపులకు బదులుగా తమ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకుల నుంచి అడ్డంకులు తొలగిస్తే తాము కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమని ఇద్దరు బీఆరెస్ ఎమ్మెల్యేల నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి సిగ్నల్స్ వెళ్లినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే బీఆరెస్ ఎల్పీ చీలికకు కావాల్సిన 25మంది ఎమ్మెల్యేల మార్కు ఫిరాయింపులు సాగాల్సివుంది. పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయన్న వాదన సైతం వినిపిస్తున్నది. ఇప్పటికే బీఆరెస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో స్థానిక కాంగ్రెస్ నేతల నుంచి రాజకీయంగా సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ తరహా సమస్యలతో పాటు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత కేసు నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరి కొత్త తలనొప్పులు ఎందుకు తెచ్చుకోవడమన్న ఆలోచనతో ఇతర బీఆరెస్ ఎమ్మెల్యేలు ఉన్నారన్న ప్రచారం సాగుతున్నది. మరీముఖ్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం బీఆరెస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంపై సానుకూలంగా లేదని, వలసల ప్రక్రియ కొనసాగించకుండా సీఎం రేవంత్‌రెడ్డికి బ్రేక్ వేసిందన్న ప్రచారం సైతం ఉన్నది.

**సీఎం ఢిల్లీ పర్యటనతో తేలనున్న వలసల లెక్కలు :** సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనతో బీఆరెస్ నుంచి వలసలపై స్పష్టత రానుందని సమాచారం. వలసల అంశంతో పాటు నూతన పీసీసీ చీఫ్ ఎంపిక, క్యాబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం చర్చించనున్నట్లుగా కాంగ్రెస్ వర్గాల కథనం. అటు ఇప్పటికే బీఆరెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల నుంచి రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి పెరిగింది. వారిని అనర్హత వేటు ముప్పు నుంచి తప్పించేందుకు మరో 15మంది బీఆరెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునే ప్రక్రియను సాగించాల్సిన అనివార్యత రేవంత్ రెడ్డిపై పడింది. లేదంటే దానం, కడియం, తెల్లంపై అనర్హత వేటు పడితే ఆ స్థానాల్లో ఉప ఎన్నికలను ఎదుర్కోక తప్పదు. అసలే కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమల్లో జాప్యం నేపథ్యంలో ఉప ఎన్నికలను ఎదుర్కోవడం అంత సులభం కాదంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

**రాజకీయంగా నిలదొక్కుకునే యత్నాల్లో బీఆరెస్ :** 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడం ద్వారా ఉప ఎన్నికల పరిస్థితి తెచ్చి రాజకీయంగా తిరిగి బలపడాలనేది బీఆరెస్ వ్యూహంగా కనిపిస్తున్నది. అటు లోక్‌సభ ఎన్నికల్లో పెరిగిన బలంతో బీజేపీ అధిష్ఠానం సైతం పార్టీ విస్తరణ కోణంలో ఉప ఎన్నికల ప్రక్రియకు తమవంతు చేయూతనందించే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో మరో 15మంది బీఆరెస్ ఎమ్మెల్యేలను నయానో భయానో చేర్చుకోవడం కాంగ్రెస్‌కు శరణ్యంగా కనిపిస్తుందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.




హైదరాబాద్ : తన తండ్రిపై దాడిని తట్టుకోలేక బాలిక కుప్పకూలిపోయిన ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు. బాలిక మృతికి సంతాపం ప్రకటించారు. 'నిజంగా హృదయవిదారకమే! గూండాలు ఇంట్లోకి ప్రవేశించి ఆమె తండ్రి సోమయ్యపై దాడి చేయడంతో 14 ఏళ్ల పావని గుండె ఆగిపోయింది. ఆమె సహాయం కోసం విలపించింది. తన తండ్రిపై దాడిని చూసి బాధ తట్టుకోలేక పావని కుప్పకూలి చనిపోయింది. ఓ కూతురికి తండ్రిగా, ఒక చిన్న అమ్మాయిని రక్షించడంలో విఫలమైనందుకు బాధగా ఉంది! ఆ కుటుంబానికి, ముఖ్యంగా తండ్రికి ప్రగాఢ సానుభూతి. ప్రభుత్వంపై మరో పెద్ద మచ్చ ఇది. తెలంగాణలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి అనేందుకు ఈ హృదయ విదారకర ఘటనే ఉదాహరణ. క్షమించండి పావని మేము నిన్ను రక్షించడంలో విఫలం అయినందుకు.' అని పోస్ట్ చేశారు.

## టీబీజేపీ అధ్యక్ష రేసు...
## ఈటలకు పొగబెడుతున్న బండి?



హైదరాబాద్ : తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఎవరవుతారా అని ఆ పార్టీ కార్యకర్తలు అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బీజేపీ అధ్యక్ష ఎన్నిక త్వరలో ఉంటుందని ప్రకటించి చాలా రోజులు గడుస్తున్న కాషాయ నేతలు ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. దీనికి కారణం నేతల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడమే. ప్రధానంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఆశీస్తున్న వారిలో ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్ రావు ఉన్నారు. ఇక మొదటి నుండి పార్టీకి సేవలు అందిస్తున్న రామ్‌చందర్‌రావు వైపే మెజార్టీ నేతలు ఉన్నారట. అయితే ఈటల మాత్రం ఢిల్లీ లెవల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఈటలకు బీజేపీ అధ్యక్ష పదవి రాకుండ రంగంలోకి దిగారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఈటెలకు పోటీగా రాంచందర్ రావుకు మద్దతిస్తూ కుర్చీ తన వాళ్లకు ఇప్పించడానికి బండి సంజయ్ ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో తాను బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అధిష్టానానికి ఫిర్యాదు చేసి తనను తప్పుకునేలా చేయడాన్ని మనసులో పెట్టుకున్నారు బండి. దీనికి ప్రధాన కారణం పరోక్షంగా ఈటలనే అని చెప్పారు కూడా. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణమ క్రమం నేపథ్యంలో బండి సంజయ్, ఈటల రాజేందర్ ఇద్దరూ ఎంపీలుగా గెలవగా బండికి కేంద్రమంత్రి పదవి దక్కింది. దీంతో ఇప్పుడు దీనిని ఉపయోగించి ఈటలకు పార్టీ అధ్యక్ష పదవి రాకుండా శతవిధాలా ప్రయత్నిస్తున్నారట బండి. మొత్తంగా మరోసారి బండి వర్సెస్ ఈటల వ్యవహారం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.




## బీజేపీ - కాంగ్రెస్ పొలిటికల్ గేమ్
## మధ్యలో ఇరుక్కున్న బీఆర్ఎస్..!

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయం ఆసక్తిరేపుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం తర్వాత.. సీనియర్ నేతలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం, కొందరు ఎమ్మెల్యేలు సైతం హస్తం గూటికి చేరడంతో తెలంగాణలో బీఆర్ఎస్ పని అయిపోయిందంటూ ప్రచారం జరుగుతోంది. మరోవైపు పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవడానికి, శ్రేణుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ మాత్రం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడానికి సంప్రదింపులు జరుపుతున్నాయి. ఇప్పటికే 9మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. మొత్తం 26మందిని చేర్చుకుంటే బీఆర్ఎస్ శాసనసభ పక్షం కాంగ్రెస్‌లో విలీనమైనట్లవుతుంది. దీంతో మరో 17మంది ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం సిద్ధం చేశారు. ఇదే సమయంలో బీజేపీలో చేరేందుకు కొందరు ఎమ్మెల్యేలు ఆసక్తి చూపిస్తున్నా.. రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీచేయాలని షరతులు పెట్టడంతో ఆచితూచి వ్యవహరిస్తున్నారట. ఎమ్మెల్యే చేరికల అంశం ఓవైపు కొనసాగుతుండగానే బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. రేవంత్ రెడ్డి పక్కా సమాచారంతోనే ఈ వ్యాఖ్యలు చేశారా.. లేదంటే వ్యూహంలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశారా అనేది తెలియాల్సి ఉంది. ఓవైపు బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించిన కొద్దిసేపటికే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం అవుతుందంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మరో బాంబు పేల్చారు. బండి సంజయ్ రేవంత్‌రెడ్డికి కౌంటర్ ఇచ్చేందుకే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. రేవంత్, సంజయ్ పోటాపోటీగా స్టేట్‌మెంట్లపై బీఆర్ఎస్ నేతలు నోరు మెదపడం లేదు. తాము ఏ పార్టీలో విలీనం కాబోమని.. ఒంటరిగానే బీఆర్ఎస్ ముందుకెళ్తోందని కేటీఆర్ ఇటీవల ప్రకటించారు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మాత్రం రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి.

**రేవంత్ వ్యాఖ్యల వెనుక..** బీఆర్ఎస్ బీజేపీలో విలీనమవుతుందంటూనే.. కేసీఆర్‌కు గవర్నర్ అవుతారని, హరీష్‌రావును అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా ఎన్నుకుని.. కేటీఆర్‌కు కేంద్రమంత్రి పదవి ఇస్తారని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

కవితకు బెయిల్ రావడంతో పాటు ఆమెను రాజ్యసభకు పంపిస్తారని రేవంత్ రెడ్డి చెప్పారు. నిజంగా బీఆర్ఎస్ బీజేపీలో విలీనమవుతుందా అనే విషయంలోనే అనేక అనుమానాలు కలుగుతున్నాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ తెలంగాణలో కొంత బలహీనపడుతోంది. వాస్తవానికి బీఆర్ఎస్ బలహీనపడితే ఆ స్థానంలో తాము బలపడొచ్చని బీజేపీ లెక్కలు కడుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ బీజేపీలో విలీనం ప్రచారం జోరుగా సాగుతోంది.

ఈ ప్రచారం ద్వారా బీజేపీ అంటే ఇష్టంలేని బీఆర్ఎస్ నేతలను తమ గూటికి తెచ్చుకోవడం కోసమే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారా లేదా నిజంగానే విలీనానికి సంబంధించి బీజేపీ, బీఆర్ఎస్ పెద్దల మధ్య చర్చలు జరిగాయా అనే విషయంలో మాత్రం క్లారిటీ రావడంలేదు.

**కౌంటర్ కోసమేనా..** రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. త్వరలోనే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం అవుతుందని, కేసీఆర్‌కు ఏఐసీసీ పదవి, కేటీఆర్‌కు పీసీసీ చీఫ్, హరీష్‌కు మంత్రి పదవి, కవితకు ఎంపీ పదవి ఇస్తారన్నారు. బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ఖర్మ తమకు లేదన్నారు.

కేవలం రేవంత్ వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చేందుకు మాత్రమే బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారనే చర్చ జరుగుతోంది. ఓవైపు కాంగ్రెస్, మరోవైపు బీజేపీ.. బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో గులాబీ బాస్ ఎలా స్పందిస్తారనేది ఆసక్తి రేపుతోంది.

# సంపాదకీయం

## ఇరుగు పొరుగు పుల్లన..

## భారత్ నైబర్ హుడ్ ఫస్ట్ కు ఏమైంది?

భారత ఉప ఖండం.. మాల్దీవుల నుంచి కలుపుకొంటే భూటాన్ వరకు, మయన్మార్ నుంచి పాకిస్థాన్ దాకా.. మన ఇరుగుపొరుగు. కానీ.. రానురాను ఈ సంబంధాలు పుల్లన అవుతున్నాయి. పదేళ్ల క్రితం మోదీ తొలిసారి ప్రధాని అయినప్పుడు పొరుగు దేశాల అధినేతలను భారత్ లో పర్యటించాలని ఆహ్వానించారు. పాకిస్థాన్ కు నాడు ప్రధానిగా ఉన్న నవాజ్ షరీఫ్ కూడా వీరిలో ఉన్నారు. విదేశాంగ విధానంలో పొరుగు దేశాలకు చాలా ప్రాధాన్యం ఇస్తామని తొలి నుంచి మోదీ సర్కారు చెబుతోంది. దీనికే 'నైబర్ హుడ్ ఫస్ట్' అని 'పొరుగు దేశాలకు మొదటి ప్రాధాన్యం' అని పేరు పెట్టింది.

**పదేళ్లలో పొరుగు దూరం...** చైనా వంటి ప్రాంతీయ శక్తి పక్కన ఉన్నప్పుడు భారత్ కు నిత్యం సవాల్. అందులోనూ ఆర్థికంగా చాలా పేద దేశాల నడుమ బలీయమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్ పై అందరి కన్నూ ఉంటుంది. అయితే, చైనా మన పొరుగును బుట్టలో వేసుకుంటూ.. ఇరుకున పెడుతోంది. దక్షిణాసియాలోని పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్ లో చైనా వేలు పెట్టింది. పెట్టుబడులు పెట్టింది. భారత్ కు వ్యతిరేకంగా ఎగదోస్తోంది. అందుకే కొన్నేళ్లుగా లంక, నేపాల్ మనకు దూరం జరుగుతున్నాయి.

**పాశ్చాత్యం కాదు.. పొరుగు...** మోదీ ప్రభుత్వం పాశ్చాత్య దేశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ పొరుగును విస్మరిస్తోందా? అనే విమర్శలు వస్తున్నాయి. నేపాల్, శ్రీలంక, బంగ్లా దేశ్ లలో మోదీ తొలి విడత ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే పర్యటించారు. కానీ, అప్పటికి, ఇప్పటికి పరిస్థితి చాలా తేడా వచ్చింది. అక్కడి ప్రజల్లో అప్పుడు మోదీకి ఉన్న ఆదరణ ఇప్పుడు లేదు. పాక్ తో సంబంధాలు ఎలాగూ మెరుగుపడడం క్లిష్టం.

**నినాదం వచ్చాకే..** విచిత్రంగా 'నైబర్ హుడ్ ఫస్ట్' విధానం తెచ్చాకే పొరుగు దేశాలు దూరమయ్యాయి. లంక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడి.. భారత్ నుంచి భారీ సహాయం పొందింది. కానీ, ఇప్పుడు చైనాకు దగ్గరైంది.

డ్రాగన్ గూఢచారి నౌకకు తన పోర్టులో లంగరుకు అనుమతించింది. నేపాల్ లో మొన్నటివరకు ఉన్న దహల్ ప్రభుత్వం భారత్ కు అనుకూలం. కానీ, ఆయనను దింపేసి కేపీ శర్మ ఓలీ వచ్చారు. ఈయన గతంలోనే భారత వ్యతిరేక గళం వినిపించారు.

**మాల్దీవ్.. మాట వినదు..** గత ఏడాది మాల్దీవుల వ్యవహారం అందరూ చూశారు. ఆ దేశ మంత్రులు.. మోదీపై నోరు పారేసుకున్నారు. భారత అనుకూల ప్రభుత్వం పడిపోయాక.. అధ్యక్ష పదవిని చేపట్టిన మొహమ్మద్ మయిజ్జు.. తమ దేశం నుంచి భారత సైన్యం వెళ్లిపోవాలని ఆదేశించారు. ఆయన పార్టీ అయితే 'ఇండియా ఔట్' ప్రచారం చేపట్టింది. మయిజ్జు చైనా వైపు మొగ్గుతున్నారు. కాగా, వ్యూహాత్మక, విదేశీ, ఆర్థిక అంశాలలో భారత్ పైనే ఆధారపడిన భూటాన్ దౌత్య సంబంధాలను నెలకొల్పాలన్న చైనా ప్రతిపాదనను నేరుగా తిరస్కరించలేదు. ఇక అఫ్గానిస్థాన్, మయన్మార్ ప్రభుత్వాలతో భారతదేశానికి సత్సంబంధాలు లేవు. అఫ్ఘాన్ లోని తాలిబాన్ తో పూర్తి దౌత్య సంబంధాలను ఏర్పరచుకోలేదు. తాజాగా వీటి జాబితాలో బంగ్లాదేశ్ చేరింది. మూడున్నరేళ్ల కిందట మోదీ బంగ్లాదేశ్ పర్యటనలో ఉండగా ఆయనకు వ్యతిరేకంగా నిరసనలు, హింస చెలరేగాయి. ఇటీవలి రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమంలోనూ భారత వ్యతిరేక భావాలు కనిపించాయి. భారత విదేశాంగ విధానంలోని తీవ్రమైన కొన్ని లోపాల కారణంగానే ఇరుగు పొరుగు దూరమయ్యాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. దక్షిణాసియా భౌగోళిక రాజకీయ నిర్మాణం కారణంగా ఈ పరిస్థితి ముందుగానే నిర్ణయమైందా? అనే ప్రశ్నలు వస్తున్నాయి.

# రూ.లక్షల్లో జీతం.. ప్రైవేటు బాగోతం



నల్గొండ : ఆ వైద్యుడి నెల జీతం రూ.2 లక్షలకు పైగానే.. నల్గొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో విధులు. నిత్యం హైదరాబాద్ నుంచి జీజీహెచ్‌కు వస్తారు. ఆసుపత్రికి వచ్చేసరికే ఉదయం 11 గంటలు దాటుతుంది. రెండు గంటలు ఓపీ విధుల్లో ఉంటారో లేదో మధ్యాహ్న భోజన సమయానికి స్థానికంగా ప్రైవేటులో ఓపీ చూసే ఆసుపత్రికి వెళ్లిపోతారు. తిరిగి సాయంత్రం వస్తారా అంటే.. అదీ లేదు. పనితీరు మార్చుకోకుంటే ఛార్జ్‌మెమో ఇస్తామని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఉన్నతాధికారి ఆయన్ను హెచ్చరించడం గమనార్హం. నల్గొండ జిల్లాలోని ఓ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించే వైద్యురాలి నెల వేతనం రూ.3 లక్షల పైమాటే. నిత్యం నల్గొండ నుంచి సదరు ఏరియా ఆసుపత్రికి వెళ్లి విధులు నిర్వహించాలి. అయితే ఎలాంటి సమాచారం లేకుండానే సెలవులు తీసుకోవడం, నెలలో పక్షం రోజులు మాత్రమే ఆమె విధులకు హాజరవుతుండటంతో.. ఇటీవలే ఉన్నతాధికారి ఛార్జ్‌మెమో ఇస్తామని హెచ్చరించడంతో.. తనను సదరు ఉన్నతాధికారి వేధిస్తున్నారని ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ప్రజాప్రతినిధికి ఫిర్యాదు చేశారు.

'ఆసుపత్రిలో వైద్య పరికరాలు లేవు. సరైన మందులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదంటూ వైద్యులు ఆందోళన చేయడం ఇప్పటివరకు చూసుంటాం. కానీ కలెక్టరు ఆదేశాల మేరకు కొంత మంది ప్రత్యేకాధికారులు నిత్యం ఆసుపత్రి పరిశీలనకు వస్తున్నారంటూ ఆందోళన చేయడం బహుశా నల్గొండ జీజీహెచ్‌లోనే చూస్తున్నా'మంటూ హాలియా నుంచి జీజీహెచ్‌కు ఓపీకి వచ్చిన రామస్వామి గురువారం జరిగిన ఆందోళనపై అభిప్రాయపడటం ప్రస్తుతం ఇక్కడ నెలకొన్న పరిస్థితికి అద్దం పడుతోంది. నల్గొండ జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో జరిగిన ఘటన వైద్యులు వర్సెస్ జిల్లా యంత్రాంగంగా మారింది. కొంత మంది వైద్యుల పనితీరు వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్న వాదన వినిపిస్తోంది. పలుమార్లు హెచ్చరించినా సీనియర్ వైద్యులతో పాటూ ఏళ్లుగా ఇక్కడే పనిచేస్తున్న వారి పనితీరు మారడం లేదని..వారిని విధులు సరిగ్గా నిర్వర్తించమని ఆదేశిస్తే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేస్తున్నారని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రైవేటు ఓపీకే మొగ్గు**

జీజీహెచ్‌లో ప్రస్తుతం 220కి పైగా వైద్య పోస్టులకు ప్రభుత్వం అనుమతించగా.. స్పెషలిస్టు వైద్యులతో పాటూ కొన్ని సైంటిస్టు పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. అత్యధికులు విధుల నిమిత్తం హైదరాబాద్ నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. స్థానికంగా ఉన్న కొంత మంది వైద్యులు సైతం వారి ప్రైవేటు క్లినిక్‌లలో ఓపీలు చూడటానికే ప్రయత్నిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొంత మంది వైద్యుల వల్ల చాలా మంది వైద్యులకు చెడ్డపేరు వస్తుందన్న అభిప్రాయమూ అంతర్గతంగా వ్యక్తమవుతోంది. చాలా మంది వైద్యులు ఉదయం ఆసుపత్రికి వచ్చి బయోమెట్రిక్ వేసి తిరిగి ప్రైవేటు ఓపీలకు వెళ్లిపోతున్నారు. ఇటీవల కలెక్టర్ తొలిసారి జీజీహెచ్‌ను సందర్శించిన సమయంలోనూ చాలా మంది వైద్యులు విధుల్లో లేకపోగా..ఆసుపత్రిలో పారిశుద్ధ్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిని నిత్యం పర్యవేక్షించే ఉన్నతాధికారులకు వైద్యులపై పట్టులేకపోవడం, ఉన్నతాధికారులు చేసే అక్రమాలకు కొంత మంది వైద్యులు సహకరిస్తుండటంతో అంతిమంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయానికొచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డి.. ఆసుపత్రిలో జిల్లా స్థాయి అధికారులతో పరిశీలన చేయాలని ఆదేశించడం ఆందోళనకు కారణమైంది.

**మెరుగైన వైద్య సేవలకే పరిశీలన**

ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలకే కలెక్టరు ప్రత్యేకాధికారులను పరిశీలనకు పంపుతున్నారు. తమకంటే తక్కువ క్యాడర్ అధికారులు ఆసుపత్రిని ఎలా పరిశీలన చేస్తారని కొంత మంది వైద్యులు అభ్యంతరం చెబుతున్నారు. కేవలం కలెక్టరు, అదనపు కలెక్టర్లకు మాత్రమే ఆసుపత్రి పరిశీలన అధికారాలున్నాయని వారి వాదన. ఆసుపత్రి నిర్వహణకు సూపరింటెండెంట్ ఉన్నారని..ఇంకా ప్రత్యేకంగా నిత్యం పరిశీలన ఎందుకని ప్రశ్నిస్తున్నారు. వారి వాదనలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

డాక్టర్ నిత్యానందం, జీజీహెచ్ సూపరింటెండెంట్, నల్గొండ

**నియంత్రణకు అధికారం ఇవ్వలేదు**

జీజీహెచ్‌లో పనిచేసే వైద్యులను నియంత్రించాలని మేం ఎవరికి అధికారం ఇవ్వలేదు. కేవలం ఆసుపత్రిలో మౌలిక వసతులు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, భోజనం నాణ్యత తదితర అంశాలను నిత్యం పరిశీలించి నివేదిక ఇవ్వాలని మాత్రమే సూచించాం. ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మేలైన వైద్యం అందించాలన్నదే అధికార యంత్రాంగం తపన. సి.నారాయణరెడ్డి, కలెక్టరు, నల్గొండ

# అడుగంటిన పాలేరు జలాశయం



మోతె : వానాకాలం వచ్చినా.. జలాశయాలపై ఆధారపడిన మంచినీటి పథకాలకు నీటి కొరత ముంచుకొచ్చింది. కొన్ని నెలలుగా వాన జాడలేక రిజర్వాయర్లు వెలవెలబోయాయి. సూర్యాపేట, ఖమ్మం తదితర జిల్లాల్లోని వేల గ్రామాలకు నీరందించే మిషన్ భగీరథ పథకాలకు ఆయువుపట్టు అయిన పాలేరు జలాశయం రోజురోజుకూ అడుగంటుతోంది. సాగర్ నీటిపై ఆధారపడిన సూర్యాపేట-ఖమ్మం జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం, పాలేరు గ్రామాల పరిధిలోని పాలేరు జలాశయంలో ప్రస్తుతం నీటినిల్వలు తగ్గిపోతున్నాయి. దీనిపై ఆధారపడి జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లోని సమారు 394 గ్రామాలకు నిత్యం మంచినీటి సరఫరా జరుగుతోంది. నీటి నిల్వలు తగ్గడంతో మోతె మండలంలోని 42 గ్రామాలకు మంచి నీరందించే పథకానికి రెండ్రోజులుగా నీరందడం లేదు. దీంతో మిషన్ భగీరథ పథకం పర్యవేక్షణాధికారులు జలాశయం లోపల మోటార్లు ఏర్పాటు చేస్తున్నారు.

**మోటార్లతో తరలింపు..**

శుద్ధజల ప్లాంటుకు రావాటర్ అందించే ఇన్‌టేక్ వెల్‌కు నీటిని సరఫరా చేసేందుకు గురువారం జలాశయంలో నాలుగు మోటార్లు ఏర్పాటు చేశారు. జలాశయంలో నీరు అందుబాటులో ఉన్న ప్రదేశంలో ఈ మోటార్లను ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఇన్‌టేక్‌వెల్ వరకు కందకం తవ్వి వాటి ద్వారా నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం మండలానికి ఏర్పడిన నీటి కొరత జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని మండలాలకు నీరందించే ప్లాంటుకు, మరో పది రోజుల్లో రావాటర్ కొరత ఏర్పడే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. నిత్యం వేల క్యూసెక్కుల నీటిని ఈ జలాశయం నుంచి పలు జిల్లాల్లోని వేల గ్రామాలకు మంచి నీరందించేందుకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో పది రోజుల్లో జలాశయంలో నీరంతా ఖాళీ అయి మిషన్ భగీరథ పథకాలకు నీటి లభ్యత దూరం కానుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ లోపు వరుణుడు కరుణించి సూర్యాపేట, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిస్తే పాలేరు జలాశయంలోకి వరద నీరు చేరి కొరత నుంచి గట్టెక్కే అవకాశం ఉంది. లేదంటే సాగర్ నుంచి మంచినీటి అవసరాలకు ఎడమకాల్వ ద్వారా నీటిని తరలించాల్సిన పరిస్థితి. సాగర్ అడుగంటిన నేపథ్యంలో మంచినీటి సమస్య తీవ్రం కానుంది.

మిషన్ భగీరథ పథకానికి అవసరమైన నీటికోసం జలాశయంలోని ఇన్‌టేక్ వెల్‌కు నీరు అందుబాటులో లేకపోవడంతో నాలుగు మోటార్లు ఏర్పాటు చేసి బావి వరకు తరలిస్తున్నట్లు ఏఈ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మోతె మండలానికి నీరందించే పథకానికి నీటి సమస్య వచ్చిందన్నారు.

# బాటసారి బావిని అభివృద్ధి చేయాలి: శివనాగిరెడ్డి

చౌటుప్పల్ : మండలంలోని తుప్రాన్‌పేట శివారులో నిర్మించిన బాటసారి బావిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, పురావస్తు పరిశోధకుడు డా.ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా బాలంసాయి బావి అని పిలువబడే దిగుడు మెట్ల బావిని అప్పటి గోల్కొండ-మచిలీపట్నం రహదారిపై వెళ్లే బాటసారుల కోసం కుతుబ్‌షాహీల కాలం(క్రీ.శ.17వ శతాబ్ది)లో తవ్వించారని, అసఫ్‌జాహీల కాలం (19వ శతాబ్దం)లో మరమ్మతులు చేశారని కట్టడ ఆనవాళ్లు సూచిస్తున్నాయన్నారు. జాతీయ రహదారికి 100 అడుగుల దూరంలో విజయవాడ వైపు వెళ్లే వారికి కుడివైపున ఉన్న ఈ బావి 70 అడుగుల పొడువు, 45 అడుగుల వెడల్పు, 50 అడుగుల లోతుతో తవ్వించినట్లు చెప్పారు. బావి లోపలికి మెట్లు, మిగతా మూడు వైపులా రాతి గోడలు, మెట్లకు ఎదురుగా నీళ్లు తోడుకోవడానికి, వ్యవసాయ అవసరాలకి వినియోగించడానికి రాతి మోటను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. మూడు శతాబ్దాల చరిత్ర గల దిగుడుబావి అలనాటి వాస్తు నైపుణ్యానికి అద్దం పడుతుందని, ఈ బావి చుట్టూ ఫెన్సింగ్ చారిత్రక వివరాలతో బోర్డును ఏర్పాటు చేస్తే పర్యాటక కేంద్రంగా రూపొందుతుందన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వెళ్లే ప్రయాణికులను ఈ బావి ఆకర్షిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# వైద్యురాల్లకు రక్షణ కొరవడితే వైద్యరంగం కుంటుపడుతుంది...

## తక్షణం నిందితులపై తగ్గిన చర్యలు తీసుకోవాలి....

## అలియాబాద్ గ్రామ పల్లె దవఖాన వైద్యురాలు

(గరుడ వార్త) శామీర్ పేట : ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులను ప్రభుత్వాలు కాపాడాలని అలియాబాద్ గ్రామ పల్లె వైద్యురాళ్ళు డా సంగీత , డా మేరీ హెలీనా, డా సృజన కోరారు. కోల్కతాలో వైద్యురాలిని అత్యాచారం,హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ, దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది 12 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేస్తూ నిర్వహిస్తున్న నిరసనకు సంఘీభావం తెలుపుతూ



అలియాబాద్ పల్లె దవాఖాన లో ధర్నా చేయడం జరిగింది . ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. భద్రత లేకపోతే వైద్య సేవలు అందించడం గగనంగా మారే పరిస్థితి ఉత్పన్నం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమం లో అందులో అలియాబాద్ , లాల్గాడి మలక్పేట్ , తుర్కపల్లి డాక్టర్ లు ఏఎన్ఎం , ఆశాలు పాల్గొన్నారు

# ఓ తల్లి తన కూతురుతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్య ..

## కుమారుడి జాడ తెలియాల్సి ఉంది...

శామీర్ పేట, (గరుడ వార్త) : ఓ తల్లి, తన కుదురుతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక సంఘటన శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం సాయంత్రం శామీర్ పేట చెరువులో ఒక యువతి, ఒక పాప మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా షామీర్పేట్ చెరువులో నుంచి సదరు తల్లి కూతుర్ల మృతదేహాలని వెలికి తీశారు. మృతురాలి వివరాల కోసం ఆరా తీయగా ములుగుకు చెందిన మరికంటి భానుప్రియ(28), కూతురు దక్షిత(3) చెరువులో పడి చనిపోయి నట్లు వివరాలు తెలియ వచ్చాయన్నారు. రెండు రోజుల క్రితం తన భార్య ఇద్దరు పిల్లలు కనిపించడం లేదంటూ



సదరు భర్త స్వామి ములుగు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిసిందన్నారు. ములుగు పోలీస్ స్టేషన్లో భానుప్రియ, కొడుకు వేదన్ష్, కూతురు దక్షిత కనిపించడం లేదని, మిస్సింగ్ కేసు నమోదు అయ్యిందన్నారు. బాబు వేదన్ష్ ఆచూకీ ఇంక తెలియ రాలేదని చెప్పారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో కే దర్యాప్తు చేస్తున్నారు.

# నమూనాల సేకరణ.. ఫలితాల విస్మరణ

జిన్నారం: కాలుష్యాన్ని కట్టడి చేయాల్సిన పీసీబీ అధికారులు, సిబ్బంది తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్షాలు కురిసినపుడు పలు పరిశ్రమలు కాలుష్య జలాలను వరదలోకి వదులుతున్నాయి. ఆ జలాలు స్థానిక చెరువుల్లో చేరుతున్నాయి. రసాయన వ్యర్థాల ఘాటు వాసనలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రజలు ఈ విషయాన్ని ఫిర్యాదు చేస్తే.. పీసీబీ అధికారులు సిబ్బందితో వచ్చి జలాల నమూనాలను తీసుకెళుతున్నారు. ఫలితాలు వెల్లడించడం లేదని, కారక పరిశ్రమలపై ఎలాంటి చర్యలు ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలిలా..: నమూనాల ఫలితాల నివేదికను పీసీబీ అధికారులు ఫిర్యాదుదారుకు విధిగా అందజేయాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి పారిశ్రామికవాడల్లోని చెరువులు, కుంటలు, బోర్ల నుంచి నమూనాలు సేకరించారు. నివేదికను స్థానిక పంచాయతీ కార్యాయలంతో పాటు మండల పరిషత్‌లో అందుబాటులో ఉంచాలి. కాలుష్యం పెరుగుతున్నట్లు తేలితే.. సంబంధిత పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి. కాలుష్య కట్టడికి కఠినంగా వ్యవహరించాలి.

**ఇవిగో ఉదాహరణలు**

గతేడాది వేసవిలో ఖాజీపల్లి అటవీ ప్రాంతానికి సమీపంలోని దుండిగల్ శివారులో ప్రమాదకర రసాయనాల డ్రమ్ములు వంద వరకు పడేశారు. అక్కడి నుంచి కాలుష్య జలాలు ఖాజీపల్లి వరకు పారాయి. ఘాటు వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సమస్యపై అప్పటి సర్పంచి సత్యనారాయణ పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి నమూనాలు సేకరించారు. ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేవు.

ఖాజీపల్లి సమీపంలోని కల్వర్టు వద్ద కాలుష్య జలాల నమూనాలు తీసుకున్న పీసీబీ అధికారులు.. ఫలితం తేల్చకుండానే మిన్నకుండటంపై విమర్శలొచ్చాయి. గొల్లగూడెం వద్ద కూడా ఇలాగే వ్యవహరించారు.

చర్యలు తీసుకుంటున్నాంకాలుష్య కట్టడి విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. నమూనాల రిపోర్టు వెంటనే కావాలని కోరిన వారికి అందజేస్తున్నాం. కార్యాలయాల్లో అందుబాటులో ఉంచడం లేదు. ఈ సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తాం.కుమార్ పాఠక్, పీసీబీ ఈఈ, రామచంద్రాపురం

# ఎత్తిపోతలా.. ఉత్తి కోతలేనా..

భూపాలపల్లి: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గోదావరి, ఇతర వాగుల నీటి వనరులను సద్వినియోగం చేసుకునేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాలు అలంకారప్రాయంగా మారాయి. మరమ్మతుల జాప్యంతో మూలనపడుతున్నాయి. పాలకులు, అధికారులు దృష్టిసారిస్తే వేల ఎకరాల బీడు భూములు సాగులోకి వచ్చి రైతులకు మేలు కలుగుతుంది. ఈ విషయంపై ములుగు సీఐ విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన, నిలిచిపోయిన పథకాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు. మంగపేట: కత్తిగూడెం సమీపంలో గోదావరి ఒడ్డున 2006-07లో దీన్ని నిర్మించారు. 8 గ్రామాల్లో 1600 ఎకరాల ఆయకట్టు నీరందించాలనేది లక్ష్యం. నిర్మించినప్పటి నుంచీ నిరుపయోగంగా ఉంది.

ఇదీ పరిస్థితి..

ములుగు సర్కిల్ పరిధిలో ములుగు, భూపాలపల్లి పరిధిలో 19 ఎత్తిపోతల పథకాలున్నాయి. ఇందులో 10 మాత్రమే పనిచేస్తున్నాయి. రామగుండం సీఈ పరిధిలో మంథని నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 5 ఎత్తిపోతలు ఉండగా అవేవీ పనిచేయడం లేదు.

మహబూబాబాద్ జిల్లాలో 18 చిన్ననీటి ఎత్తిపోతల పథకాలున్నాయి. అందులో మహబూబాబాద్ గూడూరు, కురవి, బయ్యారం, డోర్నకల్, గార్లలోని కొన్ని ఎత్తిపోతల పథకాలు పనిచేయడం లేదు.

మల్హర్: జయశంకర్ జిల్లా మల్హర్ మండలం వల్లెంకుంట మానేరు వాగు వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకమిది. 2009లో రూ.5.92 కోట్లతో ప్రారంభించారు. ఇన్‌టెక్ వెల్, ప్రధాన పైపులైన్, నియంత్రిక పనులు పూర్తయ్యాయి. ప్రధాన పైపులైన్ పగిలి ఎక్కడి పనులు అక్కడే వెక్కిరిస్తున్నాయి. మొదట్లో ఐడీసీ ఆధ్వర్యంలో పనులు చేయగా 2021లో నీటిపారుదల శాఖకు అప్పగించారు. రూ.1.36 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయి.

ఇది భూపాలపల్లి మండలం మోరంచపల్లి ఎత్తిపోతల పథకం. 1986లో ప్రభుత్వం రూ.8 లక్షలతో 1260 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీటిని అందించాలని మోరంచవాగు ఒడ్డున నిర్మించింది. రెండేళ్ల కిందటి వరకు 420 ఎకరాలకు సాగునీరు అందేది. గతేడాది అధిక వర్షాలతో మరమ్మతులకు గురైంది. అధికారులు రూ.34 లక్షలు ప్రతిపాదించారు. పనులు చేపట్టాల్సి ఉంది.

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి ఎత్తిపోతల



పథకమిది. 1989లో సుమారు రూ.10 లక్షల వ్యయంతో 200 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా నిర్మించారు. మూలనపడి దశాబ్దాలు అవుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారు.

వాజేడు మండలం పూసూరు ఎత్తిపోతల పథకం. దీనిని 1988లో సుమారు రూ. 28 లక్షల వ్యయంతో నిర్మించారు. పూసూరు, లాల్‌పేటలో 760 ఎకరాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం. పైపులైన్ల లీకేజీ, మోటార్ల మరమ్మతులు చేసినా వినియోగంలోకి మాత్రం తీసుకురావడం లేదు..

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొల్లెపల్లిలోని పాకాల వాగుపై 2018-19లో రూ. 20 కోట్ల అంచనా వ్యయంతో 1563 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా నిర్మాణ పనులు మొదలు పెట్టారు. 80 శాతం పనులు పూర్తికాగా.. పైపులైను, విద్యుత్తు, పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

ఉపయోగంలోకి తీసుకువస్తే రైతులకు మేలు- వల్లి ప్రభాకర్ కత్తిగూడెం మంగపేట మండలం

కత్తిగూడెం సమీపంలో గోదావరి ఒడ్డున నిర్మించిన ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా ఉంది. గోదావరిలోని ఇన్‌టెక్‌వెల్ సమీపంలో ఇసుక మేటలు వేయటంతో నీరు అందడం లేదు. వాటిని తొలగించి పథకాన్ని ఉపయోగంలోకి తెస్తే రైతులకు మేలు జరుగుతుంది.

వర్షాధారంతోనే పంటల సాగు -నల్లెబోయిన సమ్మయ్య, పూసూరు, వాజేడు మండలం

10 ఎకరాల భూమున్నా వర్షాధారంపైనే సాగు చేయాల్సి వస్తుంది. వాజేడు మండలం పూసూరులో నిర్మించిన పథకం అందుబాటులోకి వస్తే రెండు గ్రామాలకు సాగునీరు అందుతుంది. రైతులకు మేలు జరుగుతుంది.. ఆ దిశగా ప్రభుత్వం కృషి చేయాలి.

# జ్వరం.. అధికారుల దాపరికం

మంచిర్యాల : ఇది ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎన్‌సీడీ పరిధిలో ఏర్పాటు చేసిన పాలియేటివ్ కేర్ యూనిట్. వాస్తవానికి ఇక్కడ క్యాన్సర్ వ్యాధిగ్రస్థులకు చికిత్స అందించాలి. ఆ బాధితులు లేకపోవడం, జ్వరాలు ఎక్కువ కావడంతో ఈ వార్డును సైతం జ్వర విభాగానికి వినియోగిస్తున్నారు. తీవ్రత ఉండటంతో ఒక్కొక్కరు దాదాపు నాలుగు, అయిదు రోజులుగా ఆసుపత్రిలో ఉంటూ వైద్యం పొందుతున్నారు.జిల్లాలో జ్వరాల కేసులు భారీగా నమోదవుతున్నా వైద్యారోగ్యశాఖ మాత్రం పట్టింపులేనట్లు వ్యవహరిస్తోంది. జీజీహెచ్‌కు బాధితుల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. దాదాపు అన్ని వార్డుల



పడకలన్నీ జ్వర పీడితులకే కేటాయించాల్సిన పరిస్థితి ఉంది. అన్ని గ్రామాల్లో వ్యాప్తి తీవ్రంగా ఉన్నా వైద్యశిబిరాల ఏర్పాటు ఊసేలేదు. ఆరోగ్యశాఖ అధికారులు, సంబంధిత పీఓ కేవలం ప్రచారానికి, జిల్లా కేంద్రానికే పరిమితమవుతున్నారు తప్పితే చర్యలు తీసుకోవడం లేదు. జ్వరాల సంఖ్యను చెప్పేందుకు సైతం ఇబ్బంది పడుతున్నారంటే ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. నివారణ చర్యలకు ఆదేశాలు పక్కనపెట్టి డెంగీ జ్వరం లెక్కలను దాచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పదుల్లో డెంగీ కేసులు..జిల్లావ్యాప్తంగా డెంగీ కేసులు భారీగా నమోదవుతున్నాయి. ఇప్పటి వరకు 70కిపైగా ఆయా జ్వరాల కేసులు వచ్చినట్లు సమాచారం. టైఫాయిడ్ అయితే వందల్లో ఉంటున్నట్లు తెలుస్తోంది. అధికారులను అడిగితే మాత్రం తొమ్మిది, పది అంటూ తగ్గించి చెబుతున్నారు. ఆయా అధికారి సంబంధిత వివరాలు చెప్పేందుకు సైతం విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఖ్యను తక్కువ చేసి చెప్పడం కాకుండా గ్రామాల్లో, పురపాలికల్లో నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నిధుల రాబడి.. పనుల ఒరవడి



తాండూరు: జిల్లాలో అతి పెద్ద మున్సిపాలిటీగా తాండూరుకు సుదీర్ఘ చరిత్ర ఉంది. కానీ దశాబ్దాలుగా సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులకు వివిధ పద్దుల కింద రూ.55.58కోట్లు మంజూరయ్యాయి. మొత్తం 87 పనుల్లో కొన్నింటికి ఇప్పటికే టెండర్లు పూర్తవడంతో కొన్ని పనులు కొనసాగుతున్నాయి. పనులన్నీ పూర్తయితే పట్టణ వాసులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల నుంచి విముక్తి పొందుతారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

**వానొస్తే ఇళ్లలోకి వరద చేరిక**

తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ స్కీమ్ (టఫ్‌ఐడీసీ) కింద తాండూరు పట్టణ ప్రగతికి రూ.18 కోట్లు కేటాయించారు. పట్టణంలో ఎగువన కురుస్తున్న వర్షాలు వరదగా మారి చిలుక వాగు ఆక్రమణల వల్ల దిగువకు సవ్యంగా వెళ్లే పరిస్థితి లేదు. వరద సవ్యంగా వెళ్లేందుకు ప్రత్యేకంగా కాలువను నిర్మించడానికి ఈ నిధులనుంచి రూ.16 కోట్లను వ్యయం చేయనున్నారు.

**సీతారాం పేటలో కొత్త మార్కెట్**

పట్టణంలో సిమెంటు రోడ్లు, కాలువల నిర్మాణంతో పాటు సీతారాంపేటలోని కొత్త కూరగాయల మార్కెట్‌లో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణానికి కలిపి 14, 15వ ఆర్థిక సంఘం కింద రూ.కోట్లు వ్యయం చేయబోతున్నారు. ఇందులో 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.4.03 కోట్లు ఉంటే, 14వ ఆర్థిక సంఘం నుంచి రూ.3.43 కోట్లున్నాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నుంచి మంజూరైన నిధుల్లోంచి రూ.3.83 కోట్ల వ్యయంతో సిమెంటు రోడ్లు, కాలువల వంటి నిర్మాణాలు దశల వారీగా కొనసాగుతున్నాయి.

**ఉద్యాన వనాల అభివృద్ధి**

పట్టణంలో గ్రీన్ బడ్జెట్ కింద మంజూరైన నిధులతో ఉద్యాన వనాలను అభివృద్ధి చేయనున్నారు. ఈమేరకు గుత్తేదార్లకు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. పట్టణంలో 10 చోట్ల ఉన్న మున్సిపల్‌కు చెందిన ఖాళీ స్థలాలు కబ్జాకు గురి కాకుండా చుట్టూరా కంచె వంటి పనులు చేయనున్నారు. పట్టణంలోని గ్రీన్‌సిటీ, సాయిపూరు, ఇందిరానగర్, ఎన్టీఆర్ కాలనీ తదితర ఖాళీ ప్రదేశాల్లో ఇలాంటి పనులను చేసేందుకు రూ.1.77 కోట్లను వ్యయం చేస్తున్నారు. తాండూరు పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటిని సరఫరా చేసేందుకు అమృత్ భారత్ పనులు చేపట్టనున్నారు. ఈ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం నిధుల వాటా 60 శాతం, కేంద్ర ప్రభుత్వం వాటా 40 శాతంగా ఉంది.

**యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం**

పట్టణంలో ప్రస్తుతం జరుగుతున్న పనులను యుద్ధ ప్రాతిపదిన పూర్తిచేస్తాం. ప్రారంభం కాని పనులను వెంటనే చేపట్టాలని గుత్తేదార్లను ఆదేశిస్తాం. మొత్తంగా ప్రజలు దీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తాం.స్వప్న, మున్సిపల్ ఛైర్‌పర్సన్, తాండూరు.

# అరకొర నీరు.. ఆయకట్టుకు ఆధారం



కామారెడ్డి : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని మూడు జలాశయాల్లోకి పెద్దగా వరద చేరలేదు. జులై నెల చివరి వారం నుంచి ఆగస్టు మొదటి వారంలో స్థానికంగా కురిసిన వర్షాలతో కొత్తనీరు వచ్చి చేరింది. నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టుల్లో నీటి మట్టం కొంతమేర పెరిగింది. దీంతో ఆయకట్టు కింద పంటలకు వానాకాలంలో తడుల వారీగా నీటిని విడుదల చేసేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

**వరద రాకుంటే సాగు ప్రశ్నార్థకం**

స్థానికంగా కురిసే వర్షాలతో గతంలో పోచారం జలాశయం పొంగేది. మూడు నుంచి నాలుగు టీఎంసీల వరద నిజాంసాగర్‌కు చేరేది. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో ప్రాజెక్టుకు అరకొరగానే వరద వచ్చింది. ఉన్న నీటిని పొదుపుగా వాడుకునేందుకు నీటిపారుదల శాఖ అధికారులు ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించి తడుల వారీగా విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని 1.100 టీఎంసీని విడుదల చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. నేడు కొంత మేర విడుదల చేయనున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వరద రాకుంటే యాసంగి సీజన్‌లో ఆయకట్టు కింద పంటల సాగు ప్రశ్నార్థకంగా మారనుంది.

**నిజాంసాగర్‌లో పెరుగుతున్న నిల్వలు**

ఎగువ నుంచి వస్తున్న వరదలతో నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం నీటినిల్వలు 4 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటితో ఆయకట్టు పంటలను పండించవచ్చని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఇలానే నెలకొంటే యాసంగి సీజన్‌లో నీటి సరఫరా చేయడం ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని గోదావరి జలాలను తరలిస్తే రబీలో ఆయకట్టు కింద పంటలు పండనున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వరద రాని కారణంగా కౌలాస్ నాలా ప్రాజెక్టుకు జలకళ సంతరించలేదు. ఉన్న కొద్దిపాటి నీటిని రైతుల డిమాండ్ మేరకు పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

పొదుపుగా వాడుకోవాలి- శ్రీనివాస్, సీఈ, కామారెడ్డి, నీటిపారుదల శాఖ నిజాంసాగర్, పోచారం జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న నీటిని తడుల వారీగా విడుదల చేయాలని నిర్ణయించాం. రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలి.

# పల్లె పోరుకు కసరత్తు



భానుపురి : పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అధికార యంత్రాంగం కార్యాచరణను ముమ్మరం చేసింది. సెప్టెంబరు చివరి వారంలో ఎన్నికలు ఉండనుండటంతో ఇప్పటికే పల్లెల్లో చర్చలు మొదలయ్యాయి. వార్డుల వారీగా మ్యాపింగ్, ఓటరు జాబితా తయారీపై కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో సంబంధిత అధికారులు జాబితా వివరాలను ఉన్నతాధికారులకు పంపించారు.

**గ్రామాల్లో జోరుగా చర్చ..**

ఉమ్మడి జిల్లాలో 1740 పంచాయతీలు, 20,880 వార్డులున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం పల్లె పోరుకు ప్రకటన చేయడంతో గ్రామాల్లో చర్చ జోరుగా సాగుతోంది. అనుచరగణంతో ఆశావహులు రిజర్వేషన్ల ఖరారుపై చర్చలు జరుపుతున్నారు. గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లకు ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతూ చట్టం తీసుకొచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మేరకు నిర్వహిస్తుందా.. మారుస్తుందా అనే దానిపై సందిగ్ధం నెలకొంది.

**వివరాల నమోదు ఇలా..**

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలు పంపాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగా.. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బంది వివరాలు అందుబాటులో ఉండటంతో వాటిని ఇప్పటికే టీ-పోల్‌వెబ్‌సైట్‌లో అధికారులు నమోదు చేశారు. ఎన్నికలు విడతల వారీగా జరగనుండటంతో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. 200 మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్, ఒక పోలింగ్ అధికారి ఉంటారు, 201 నుంచి 400 మంది ఓటర్లు ఉండే దగ్గర ఒక ప్రిసైడింగ్, ముగ్గురు పోలింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు.

**ద్వితీయశ్రేణి నాయకుల ఆసక్తి**

ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎవరికి వారు తమ పార్టీ మద్దతుతో పోటీలో నిలవాలని, ఎవరి మద్దతు ఉంటే తమకు లాభమనే విషయంపై సమాలోచనలో ఉన్నారు. గతంలో పోటీచేసి ఓడిపోయిన వారితోపాటు కొత్తవారు సైతం బరిలో నిలబడేందుకు ఆసక్తి చూపుతున్నారు.

# అన్నీ తామై.. శిశువులకు ప్రాణమై

మంచిర్యాల : ఎంసీహెచ్‌లోని ఎస్ఎన్‌సీయూ(నవజాత శిశు సంరక్షణ కేంద్రం)లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పిల్లల వైద్య నిపుణులు, స్టాఫ్‌నర్సులు ఈ విభాగానికి శాశ్వతం కాదు. ఇక్కడ పని చేయాల్సిన వైద్యులు, సిబ్బంది ఒక్కరు కూడా లేరు. నియామకం చేయాల్సి ఉన్నా పర్యవేక్షకుల పట్టింపులేనితనం, నిర్లక్ష్యంతో కొన్ని నెలలుగా ఖాళీగా ఉంటున్నాయి. కాగా ఆయా ఎస్ఆర్(పిల్లల వైద్య నిపుణులు)లు సాయికిరణ్, సిరికిరణ్, సరస్వతితోపాటు స్టాఫ్‌నర్సులు 20 పడకల ఎస్ఎన్‌సీయూకు అన్నీ తామే అవుతున్నారు. ఏడాది కాలంలో పదుల సంఖ్యలో తక్కువ బరువు, అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు ప్రసవంతో జన్మించిన శిశువులకు ప్రాణం పోశారు. వీరికితోడుగా స్టాఫ్‌నర్సులు సైతం ఉత్సాహంగా పనిచేయడమే కాకుండా వైద్యుల సాయంలో భాగస్వాములవుతున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా, శిశుఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న కొందరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు నిత్యం విధులకు రావడమే గగనమైంది. అందరిలో కొందరు వేరయా అనేలా పలువురు ఎస్ఆర్(సీనియర్ రెసిడెంట్లు) వృత్తినే దైవంగా భావిస్తూ సేవాతత్వాన్ని చాటుతున్నారు. కేవలం ఏడాదిపాటు పని చేసేందుకు వచ్చినవారే అయినా బాధితులు జీవితాంతం గుర్తుంచుకునేలా సేవ చేస్తున్నారు. చావుబతుకుల మధ్య ఉన్న శిశువులను ప్రాణం పోసి కాపాడుతున్నారు. గ్రాముల్లో జన్మించినవారిని కిలోలుగా మార్చి జీవం పోస్తున్నారు.

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలానికి చెందిన మారుబాయికి నెలలు నిండకముందే నొప్పులు రావడంతో అత్యవసర వాహనానికి సమాచారం అందించి ఎంసీహెచ్‌కు వచ్చేందుకు సిద్ధమయ్యారు. మార్గమధ్యలో తీవ్రమవడంతో 108లోనే ప్రసవించింది. అనంతరం ఆసుపత్రికి తీసుకురాగా శిశువు కిలో కంటే తక్కువగా ఉంది. తల్లి రక్తహీనతతో బాధపడుతూ బలహీనంగా కనిపించింది. పాలిచ్చే పరిస్థితిలో కూడా లేకపోవడంతో శిశువు బాధ్యతను ఎస్ఎన్‌సీయూ సిబ్బంది తీసుకున్నారు. రెండు నెలలపాటు తల్లి, బిడ్డకు అన్నీ



తామయ్యారు. శిశువును సొంత బిడ్డలా చూసుకున్నారు. దాదాపు 900 గ్రాముల బరువును పెంచి తల్లికి అప్పగించారు. ప్రస్తుతం ఇరువురి ఆరోగ్యం మెరుగుపడటంతో డిశ్చార్జి చేశారు.

కుమురం భీం జిల్లా ఈజ్‌గాంకు చెందిన జయంతి దాస్ ఏడు నెలల గర్భిణి. ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా, కడుపులోని బిడ్డకు హాని జరిగే అవకాశం కనిపిస్తుండటంతో కాగజ్‌నగర్‌లో శస్త్రచికిత్స చేశారు. ప్రసవించిన బిడ్డను ఎస్ఎన్‌సీయూలో చేర్చాలని ముందే సూచించగా తల్లిని అక్కడే ఉంచి 800 గ్రాముల బరువు ఉన్న శిశువును మంచిర్యాలకు తీసుకొచ్చారు. ప్రైవేటులో చేర్చినా ఖర్చు భరించలేకపోయారు. దీంతో ఎంసీహెచ్‌లోని నవజాత శిశు సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. ఆ శిశువును ఇక్కడి సిబ్బంది కంటికి రెప్పలా చూసుకున్నారు. పూర్తి ఆరోగ్యంగా మార్చడంతోపాటు 800 గ్రాములకు మరో ఎనిమిది వందల గ్రాములు చేసి పంపించారు. దీంతో ఆయా బాధిత బంధువులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలపడంతోపాటు దేవుళ్లంటూ దండం పెట్టి వెళ్లారు.

# నిర్ధారణ పరీక్షలకు విఘాతం..

ఆదిలాబాద్ : రిమ్స్‌కు అనుసంధానంగా ఉన్న టీహబ్ డయాగ్నోస్టిక్ కేంద్రంలో థైరాయిడ్ నిర్ధారణ పరీక్షల యంత్రం, బయోకెమిస్ట్రీ యంత్రాలు మొరాయించటంతో నిర్ధారణ పరీక్షలకు విఘాతం ఏర్పడింది. సీమెన్స్ బయోకెమిస్ట్రీ యంత్రం మూడు రోజులనుంచి పనిచేయటం లేదు. థైరాయిడ్ నిర్ధారణ పరీక్షల యంత్రం పనిచేయటం లేదు. దాదాపు అరవైకి పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో అంతరాయం ఏర్పడింది. రోగులకు నిర్ధారణ పరీక్షల నివేదికలు అందక ఇబ్బందుల పాలవుతున్నారు. కొందరు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తుండగా ఆర్థిక స్థోమత లేనివారు నివేదికల కోసం ఎదురు చూస్తున్నారు.రిమ్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన టీహబ్ డయాగ్నోస్టిక్ కేంద్రంలో గతంలో కేవలం వైద్యారోగ్య శాఖ పరిధిలోని పీహెచ్‌సీలకు చెందిన నమూనాల నిర్ధారణ పరీక్షలు చేసేవారు. ఆయా పీహెచ్‌సీలలో రోగులనుంచి సేకరించిన నమూనాలను ప్రతి రోజు ప్రత్యేక వాహనంలో టీహబ్‌కు చేరవేస్తుంటారు. ఆ నమూనాలను టీహబ్‌లో నిర్ధారణ పరీక్షలు చేసి రోగి చరవాణికి, సంబంధిత పీహెచ్‌సీకి ఆన్‌లైన్‌లో నివేదికలు అదేరోజు సాయంత్రం లేదా మరుసటి రోజు అందిస్తున్నారు. ఏడాది కాలంగా రిమ్స్‌కు టీహబ్‌ను అనుసంధానించారు. రిమ్స్‌లోని రోగులకు సంబంధించిన నమూనాలు సైతం టీహబ్‌లోనే పరీక్షిస్తున్నారు. కేంద్రంలో పని ఒత్తిడి పెరిగింది. యంత్రాలపైనా భారం ఎక్కువైంది. వేసవిలోనూ తరచూ యంత్రాలు మొరాయించగా అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా ఆ పరిస్థితులు తలెత్తినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ఎక్కువగా లేకున్నా యంత్రాలు మొరాయించటంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అధికారుల స్పందించి వెంటనే మరమ్మతులు పూర్తి చేసి నివేదికలు అందేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

**50 రకాల పరీక్షలకు ఆటంకం**

ఇది టీ-హబ్‌లోని బయోకెమిస్ట్రీ సీమెన్స్ యంత్రం. సాంకేతిక లోపంతో మూడురోజులుగా పని చేయటం లేదు. ఈ యంత్రంలో ఎల్‌ఎఫ్‌టీ(లివర్ ఫంక్షన్ టెస్ట్), ఆర్ఎఫ్‌టీ (రీనల్ ఫంక్షన్ టెస్ట్), షుగర్, క్యాల్షియం, యూరిక్ యాసిడ్, అమలైజ్ ఇలా దాదాపు 50 రకాల నిర్ధారణ పరీక్షలు చేస్తారు. ఈ యంత్రం చెడిపోవటంతో ఆ పరీక్షలన్నీ నిలిచిపోయాయి. రోగులు వీటిని బయట చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**థైరాయిడ్ పరీక్షలు సైతం..**

టీహబ్‌లో థైరాయిడ్ నిర్ధారణ, విటమిన్స్ తదితర పది రకాల పరీక్షలు ఈ యంత్రంలో నిత్యం చేస్తుంటారు. ఈ యంత్రం పని చేయటం లేదు. జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలు, రిమ్స్‌లో సేకరించిన నమూనాలన్నీ నిరుపయోగంగా మారి బాధితులకు నివేదికలు రాకపోవడంతో చికిత్సలు అందించడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయి.

# నిరభ్యంతర పత్రాల దందా

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి అనిశాకు చిక్కడం రెవెన్యూ శాఖలో ప్రకంపనాలు సృష్టిస్తోంది. ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డారనే దానిపై రెవెన్యూ ఉన్నతాధికారులు, అనిశా అధికారులు సాక్ష్యాధారాలు సేకరిస్తున్నారు. అదనపు కలెక్టర్ కార్యాలయ కేంద్రంగా నిరభ్యంతర పత్రాల దందా కొనసాగిందన్న ప్రాథమిక సమాచారం లభించినట్టు తెలిసింది.

**నాలుగో వ్యక్తికి తెలియకుండా**

నిరభ్యంతర పత్రాల జారీలో కీలక బాధ్యతలు పోషిస్తున్న ఒక అధికారి,



అతడి సహాయకుల్లో ఇద్దరు నాలుగో కంటికి తెలియకుండా వ్యవహారాలను చక్కబెట్టినట్టు సమాచారం. శేరిలింగంపల్లి, గండిపేట, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధుల్లో ఇళ్లు, దుకాణాలు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించేవారి నుంచి వీరు రూ.లక్షల్లో నగదు తీసుకున్నారు. భూముల క్రమబద్ధీకరణకు జీవో నంబరు 59కింద వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటినుంచి రూ.కోట్లలోనే ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

**టెండర్లలోనూ అమ్యామ్యాలు** రంగారెడ్డి జిల్లాలోని గురుకుల విద్యాసంస్థల విద్యార్థులకు ఆహారాన్ని సరఫరా చేసేందుకు టెండర్ల ఖరారులోనూ అమ్యామ్యాలు డిమాండ్ చేసినట్టు తెలిసింది. డబ్బు ఇవ్వకపోవడంతో ఆ టెండర్లను తొక్కిపెట్టినట్టు సమాచారం.

# ముంపు ముప్పు తప్పేదెన్నడో?

జమ్మికుంట : ముంపు ప్రాంతమైన జమ్మికుంట హౌసింగ్ బోర్డు కాలనీవాసులకు ఏటా వర్షాకాలంలో తిప్పలు తప్పడం లేదు. ఇళ్లలోకి మోకాలు లోతు నీరు చేరి తీవ్ర నష్టం కలుగుతోంది. భారీ వర్షం పడితే కంటి మీద కునుకు లేకుండా స్థానికులు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ప్రాంతలైన దుర్గాకాలనీ, హన్మండ్లవ ల్లి, అంబేడ్కర్ కాలనీలలోనూ పదేళ్లుగా ముంపు తిప్పలు తప్పటం లేదు.

**సమస్య ఎక్కడుంది?**

ఒకప్పుడు కుంట ప్రాంతంగా ఉన్న స్థలంలో హౌసింగ్‌బోర్డు కాలనీ నిర్మాణమైంది. 2018లో కురిసిన భారీ వర్షంతో సుమారు 300 గృహాలు, పరిసర ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి సెల్లార్ పరిసర ప్రాంతాలు నీట మునిగాయి. రోజుల తరబడి బాధితులు తీవ్ర



ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ పాలక కమిటీ రూ.35 లక్షలతో వరద కాలువ నిర్మాణాన్ని చేపట్టింది. 2020లో కాలువ నిర్మాణం చేసినా సమస్య పరిష్కారం కాలేదు. 2021, 2023లలో భారీ వర్షాల కారణంగా దాదాపు 400 ఇళ్లవారు పడరాని కష్టాలు పడ్డారు. ఎన్నికల సమయాల్లో పలు పార్టీల నేతలు క్షేత్రస్థాయిలో పరిశీలించి వరద కాలువ నిర్మాణం పూర్తికి హామీలు ఇచ్చారు. పాలకులు పూర్తి స్థాయిలో వరద కాలువ నిర్మించడంతోపాటు సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పుర కమిషనర్ అయాజ్‌ను సంప్రదించగా వరద కాలువ నిర్మాణం కోసం ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించామని తెలిపారు.

# భారీవర్షం.. పత్తి రైతు ఆగమాగం!

నెల్లికుదురు : ఇనుగుర్తి, నెల్లికుదురు మండల గ్రామాల్లో రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు పడిపోయాయి. సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పత్తి పంట నేలవాలింది. అక్కడక్కడ పంట చేల్లో విద్యుత్తు తీగలు అక్కడక్కడ నేలవాలడంతో రైతులు ఆందోళన చెందారు. ఇనుగుర్తి మండలం



చిన్ననాగారం గ్రామ పరధిలో సుమారు 60 ఎకరాల్లో పత్తి పంట నేలకొరిగింది. చిన్ననాగారం విద్యుత్తు ఉపకేంద్రంలో చెట్టు కూలి సిబ్బంది ఎల్లగౌడ్, వెంకన్నకు చెందిన ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. మీట్యాతండా పంచాయతీ పరిధిలోని పంతులుతండాలో జనవాసాల మధ్య ఉన్న విద్యుత్తు స్తంభం నేలకొరగడంతో తీగలు తెగిపోయాయి. అప్రమత్తమైన అధికారులు విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో తండావాసులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఆరోగ్య భాగ్యం.. పెరటి మొక్క పెంపకం



పరిగి : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం మన మహోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందుకోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోంది. లక్ష్య సాధనలో భాగంగా ఈసారి గ్రామీణాభివృద్ధి అధికారులు ప్రజలు పెరట్లో పెంచుకునే మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వాటినే ఎక్కువగా పంపిణీ చేస్తున్నారు. వీటిని తీసుకువెళ్లేందుకు ప్రజలు సైతం ఉత్సాహం చూపుతున్నారు. జిల్లాలో అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు, స్థలాలు, పరిశ్రమల ప్రదేశాలు, రహదారులు, పొలం గట్లు ఇలా పెద్దఎత్తున మొక్కలు నాటుతున్నారు. రైతులు ఇష్టపడే నీలగిరి, టేకు వంటి వాణిజ్య మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నాటిన మొక్కల సంరక్షణ విషయంలోనూ ఈసారి ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారించింది.

పంచాయతీ రాజ్, ఉపాధి హామీ, అటవీ శాఖల పర్యవేక్షణ: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం కింద కొన్ని నెలలుగా అధికారులు పక్కా ప్రణాళికను చేపట్టారు. పంచాయతీరాజ్, ఉపాధిహామీ, అటవీశాఖల పర్యవేక్షణలో వీటిని పెంచారు. గ్రామాల్లో సర్పంచులు లేకపోవటంతో ఆయా గ్రామాల పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది.

వేసవిలో మొక్కలకు నీరందించేందుకు అక్కడక్కడ ఇబ్బందులు తలెత్తినా అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయించారు.

పూడూరు మండలంలోని 31, పరిగి మండలంలోని 37 పంచాయతీల పరిధిలోని నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. ఉపాధి హామీ కూలీలతో గ్రామాల్లో మొక్కలు నాటే పనులు ఊపందుకున్నాయి. పరిగి మండలంలో 1.19లక్షల మొక్కలు నాటుతున్నారు.

పంచాయతీకి కేటాయింపు ఇలా..

మొత్తం గ్రామ పంచాయతీలు.. 566

ఈసారి ఇవ్వనున్నవి 8,000

నర్సరీల ఏర్పాటు.. 563

ఒక్కో పంచాయతీకి గతేడాది.. 4500 మొక్కలు

ఉసిరి, జామ, కరివేపాకు, మామిడి తదితరాలు

ప్రజలు ఆసక్తి చూపే మొక్కల పెంపకాన్ని కూడా చేపట్టారు. ప్రధానంగా కరివేపాకు, బొప్పాయి, అల్లనేరెడు, దానిమ్మ, జామ, మామిడి, తులసి, కలబంద ఉసిరి, గులాబి, మందారం వంటి మొక్కలను సరఫరా చేయడంతో వాటిని తీసుకువెళ్లేందుకు ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. అనేక రకాల ఔషధ మొక్కలు, పెరట్లో పెంచుకునే పూల మొక్కలకు ప్రాధాన్యం ఇచ్చారు.

సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

నిర్ణీత లక్ష్యాన్ని పూర్తిచేయడంతో పాటు ప్రధానంగా వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వాటి నిర్వహణ బాధ్యతలను క్షేత్ర సహాయకులు, గ్రామ పంచాయతీలతో పాటు మేమూ తీసుకుంటాం. ఉష, రాములు, ఏపీఓలు, పరిగి, పూడూరు.

# పడకేసిన నగరం..



కరీంనగర్ : జిల్లాలో సీజనల్ వ్యాధుల తీవ్రత పెరిగింది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జ్వరాలు విస్తరిస్తున్నాయి. దీంతో బాధితుల వివరాలు సేకరించేందుకు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అంతటా నిర్వహిస్తున్న జ్వరాల సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. కేవలం జ్వరంతో బాధపడేవారు కాకుండా ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వారిని గుర్తించి అవసరమైన స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారు. తీవ్రత ఉన్న వారిని జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలిస్తున్నారు.

**రోజూ 50 ఇళ్లకు తగ్గకుండా..**

గత నెల 25 నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ సర్వే ప్రారంభించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం సూపర్‌వైజర్‌తోపాటు కొన్ని ప్రాంతాలకు వైద్యులు కూడా వెళ్తున్నారు. రోజూ 50 ఇళ్లకు తగ్గకుండా సర్వే చేస్తూ.. వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పల్లె బస్తీ దవాఖానాలకు పంపించి అవసరమైన వైద్యం అందేలా చర్యలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల బృందం పరీక్షించి ప్రాథమికంగా అవసరమైన ఔషధాలను అక్కడే అందజేస్తున్నారు.

**దోమలు వ్యాప్తి చెందకుండా..**

సర్వే బృందాలు ఇంటింటికి వెళ్లి నిల్వనీరు ఉన్నట్లైతే తొలగించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని కుటుంబసభ్యులకు చెబుతున్నారు. ఇప్పటివరకు ఏడు లక్షలకు పైగా మందిని సర్వే చేయగా.. మూడు వేలకు పైగా సాధారణ జ్వరాల బారిన పడ్డట్లు గుర్తించారు. ముఖ్యంగా దోమలు వ్యాప్తి చెందకుండా నియంత్రణ పద్ధతులు సూచిస్తున్నారు. సర్వేలో వెలుగుచూసిన అంశాలను.. పురపాలికలు, పంచాయతీ అధికారులకు సమాచారం అందేలా చూస్తున్నారు.

**వైద్యులను అప్రమత్తం చేస్తున్నాం- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి**

సర్వే చేయడమే కాకుండా జ్వరాల బారిన పడినవారిని గుర్తించి తగిన మందులు అందిస్తున్నాం. ఇప్పటివరకు 90శాతం మంది చికిత్స నుంచి కోలుకున్నారు. ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై సమీక్షిస్తూ వైద్యులను అప్రమత్తం చేస్తున్నాం.

# రూ.15 లక్షలతో వసతుల కల్పన

మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో కొన్ని రోజులుగా చోటు చేసుకున్న ఘటనలతో రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం వసతులు మెరుగు పరుస్తున్నారు. మరో రూ.50 లక్షలు మంజూరు చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించడంతో పాఠశాలలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు సమకూరుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. అంతే కాకుండా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వయంగా పాఠశాలను సందర్శించడం, విద్యార్థులు, తల్లిదండ్రులతో మూడు గంటల పాటు మాట్లాడి భరోసా నింపే ప్రయత్నం చేశారు. ఉప ముఖ్యమంత్రి సందేశంతో తల్లిదండ్రుల్లో కొంత భయం తొలగించేలా చేశారు. పాఠశాలలో అయిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 640 మందికి 540 మంది విద్యార్థులున్నారు. గత నెల 26న ఒకరు, ఈ నెల 9 మరొక విద్యార్థి మృతి చెందగా, నలుగురు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. దీంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురై విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లారు. ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయడంతో పాటు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌కు మెమో జారీ చేశారు. ఈ సంఘటనలు సంచలనం సృష్టించడంతో ప్రభుత్వం, అధికార యంత్రాంగం కదిలి దిద్దుబాటు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పాఠశాలను సందర్శించి వసతుల కల్పనకు రూ.15 లక్షలు మంజూరు చేశారు. పాఠశాలలో పారిశుద్ధ్య చర్యలకు, మౌలిక వసతుల మెరుగునకు అదనపు కలెక్టర్ గౌతంరెడ్డికి బాధ్యతలు అప్పగించడంతో ఆయన దగ్గరుండి పనులు పర్యవేక్షించారు.

**దిద్దుబాటు చర్యలిలా..**

మెట్‌పల్లి, కోరుట్ల పురపాలికల నుంచి జేసీబీలు, పారిశుద్ధ్య కార్మికులను రప్పించి పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించడంతో పరిసరాలు శుభ్రమయ్యాయి.

శిథిలావస్థకు చేరిన పాత గదులను తొలగించారు. భోజనశాలకు నూతనంగా రంగులు వేశారు.

పాఠశాలలో రూ.4.25 కోట్లతో నిర్మించిన నూతన భవనంలో విద్యుత్తు, ప్లంబింగ్ పనులు చేపట్టారు. తరగతి గదుల్లో పంకాలు బిగించారు.



విద్యార్థులు కూర్చొనేందుకు 120 డెస్క్ బెంచీలు తెప్పించారు. పాత తరగతి గదుల కిటికీలకు మెస్ జాలీలు అమర్చారు.

రెండు హైమాస్ట్ దీపాలను నూతనంగా ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రాంగణంలో స్తంభాలకు విద్యుత్తు దీపాలను బిగించారు.

మెరుగుపడాల్సిన సౌకర్యాలివీ..

పాఠశాలలో పురాతన మూత్రశాలలు, మరుగుదొడ్లు ముప్పై వరకు ఉన్నాయి. మరికొన్ని నిర్మించడంతో పాటు వాటిని ఆధునికీకరించాల్సి ఉంది.

ప్రస్తుతమున్న భోజనశాలలో కేవలం 200 మంది విద్యార్థులు మాత్రమే భోజనం చేసేలా ఉంది. దానిని 600 మందికి సరిపోయే విధంగా విస్తరించాలి.

పాఠశాల ఆవరణలో ఉన్న పాత రేకుల షెడ్లు, నిరుపయోగంగా ఉన్న ప్రయోగశాలలు పూర్తిస్థాయిలో తొలగించాల్సి ఉంది.

నూతన భవనం కేవలం బోధనకు మాత్రమే సరిపోయేలా ఉంది. కొత్తగా వసతి కోసం నూతన భవనం నిర్మించడంతో పాటు అందులోనే మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి.

పాఠశాలలోనే ఉపాధ్యాయులకు సైతం క్వార్టర్లు నిర్మించాలి. విద్యార్థులు నిద్రించేందుకు పడక మంచాలు అందుబాటులోకి తేవాలి.

ఆవరణలో ఉన్న పాడుబడ్డ బావి, పురాతన నీటి ట్యాంకులను తొలగించాలి. వంట గది నుంచి వెలువడ్డ మురుగు నీరు బయటకు వెళ్లేలా పైపులైన్ నిర్మించాలి.

చుట్టు పంట పొలాలు ఉండడంతో విష కీటకాలు లోనికి రాకుండా ప్రహరీ చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలి.

# ఆ నీరు తాగొచ్చా..!

సూర్యాపేట : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా తాగేందుకు శుద్ధి నీరు, అవసరాలకు స్థానిక బోర్ల నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. కాగా ఈ నీరు సురక్షితమేనా.. కాదా.. అన్న సందిగ్ధం ప్రజల్లో నెలకొంది. ఇటీవల ట్యాంకుల శుభ్రతపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నీటి నాణ్యతపై కేంద్ర ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. 'జల్ జీవన్ మిషన్'లో భాగంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో క్షేత్రస్థాయిలో నీటి నమూనాలు ఇప్పటికే సేకరించారు. త్వరలో పరీక్షించనున్నారు. నీటి సరఫరాపై సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి ఆరా తీశాయి. నీటి పరీక్షల అనంతరం నివేదికల ఆధారంగా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కేంద్రం ప్రణాళికలు రూపొందించే అవకాశం ఉంది. ఒకవేళ బాగానే ఉంటే వాటినే అందించేలా ప్రోత్సహించనుంది.

**సర్వే రోజునే గ్రామం ఎంపిక**

ఉమ్మడి జిల్లాలోని 73 మండలాలు, 1740 గ్రామ పంచాయతీల్లో సర్వే చేపట్టారు. జల్ జీవన్ మిషన్ సర్వే బృందాలు గ్రామాల్లో సర్వే చేసే విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఎలాంటి సమాచారం లేకుండా నేరుగా గ్రామాల్లోకి వెళ్లి ఆరా తీశారు. ముందస్తు సమాచారమిస్తే నీటి సరఫరాలో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకునే అవకాశం ఉండటంతో వివరాలు వెల్లడించడం లేదు. ఏ రోజు, ఏ గ్రామంలో సర్వే చేయనున్నారో అదే రోజు గ్రామాన్ని ఎంపిక చేసుకుని క్షేత్రస్థాయికి వెళ్లారు. నీటి



నమూనాలను ప్రయోగశాలకు పంపించారు.

**యాప్‌లో నమోదు**

ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ఇందులో మిషన్ భగీరథ పథకం ద్వారా కొంత, స్థానిక బోరుబావులతో కొంత నీటిని కలిపి ప్రజలకు అందిస్తున్నారు. ట్యాంకుల మొదటి నుంచి లీటర్, చివరి కుళాయి వద్ద లీటర్ నీటి నమూనాలు సేకరించారు. సర్వే బృందాలు సేకరించిన వివరాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేస్తారు. ఎంపిక చేసిన గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాల్లో సరఫరా అవుతున్న నీటి నమూనాలు తీసుకున్నారు.

**సర్వే ఇలా..**గ్రామం, ఇంటి నంబర్ నమోదు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఉందా.. నిత్యం ఎన్ని లీటర్ల నీరు సరఫరా అవుతుంది, తాగడానికి నీటిని వినియోగిస్తున్నారా లేదా వంటి వివరాలు సేకరించారు.

# కొరత తీరేలా.. ఉపాధికి బాసటగా!

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం కార్మికులు, రైతుల ఉపాధి కల్పనకు బాసటగా నిలుస్తోంది. కాగితం ఉత్పత్తికి ముడిసరకు కొరత లేకుండా హైబ్రిడ్ వంగడాలైన నీలగిరి, సుబాబుల్, సరుగుడు తదితర మొక్కల పెంపకానికి రైతులను ప్రోత్సహిస్తోంది. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం, వరంగల్, ఖమ్మం, గజ్వేల్‌తోపాటు మహారాష్ట్రలోని యావత్మాల్, చంద్రపూర్‌లలో రైతులకు మొక్కలను పంపిణీ చేసి పెరిగిన అనంతరం యాజమాన్యమే కొనుగోలు చేస్తోంది.

పట్టణంలోని పెద్దవాగు రోడ్డులో ఉన్న 25 ఎకరాల మిల్లు స్థలంలో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మొక్కల పెంపకం యూనిట్లను ఏర్పాటు చేశారు. విత్తన శుద్ధి చేసిన వాటిని స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక యూనిట్లలో మొక్కలను పెంచుతున్నారు. వీటితోపాటు మొక్కలను అంటుకట్టి ప్రత్యేక వాతావరణ పరిస్థితులు కల్పించి వేర్లు వచ్చిన అనంతరం వాటిని రైతులకు అందజేస్తున్నారు. వివిధ జిల్లాల్లో మిల్లు యాజమాన్యం ఆధ్వర్యంలో మొక్కల పెంపకం 2020లో ప్రారంభించారు. స్థానికంగా ఈ యూనిట్లలో వంది మంది కూలీలు పనిచేస్తున్నారు.

**యాజమాన్యమే కొనుగోలు**

మిల్లులో రోజూ సుమారు 350-400 టన్నుల కాగితాన్ని ఉత్పత్తి చేస్తోంది. దాదాపు 1200 టన్నుల కర్ర అవసరం. ముడిసరకుకు భవిష్యత్తులో కొరత లేకుండా ఆయా ప్రాంతాల్లో రైతులను ప్రోత్సహించి ముడిసరకు ఉత్పత్తి చేపడుతున్న యాజమాన్యం దళారుల బెడద లేకుండా నేరుగా రైతుల నుంచి కర్రను కొనుగోలు చేస్తోంది. ఒక్కో మొక్కను రూ.2.50 రైతులకు అందిస్తుంది. ఎకరా విస్తీర్ణంలో వెయ్యి




మొక్కలు సాగు చేసుకోవచ్చు. మొదటి సంవత్సరం ఎకరాకు సుమారు రూ.20 వేల వరకు సాగు ఖర్చు ఉంటుంది. రెండో సంవత్సరం ఎలాంటి ఖర్చు ఉండదు. 8 ఇంచుల మందం కర్ర ఎదిగిన అనంతరం కొనుగోలు చేస్తారు. 15ఏళ్లపాటు దిగుబడి వస్తుంది. ఎకరాకు 50 టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు రూ.4500-5000 వరకు చెల్లించి యాజమాన్యం కొనుగోలు చేస్తోంది.

**రైతులకు లాభసాటి**

రైతులు సుబాబుల్, నీలగిరి, సరుగుడు మొక్కల పెంపకానికి ఎస్పీఎం యాజమాన్యం ఎంతో ప్రోత్సహిస్తోంది. మొక్కల సరఫరాతోపాటు సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు సిబ్బందిని నియమించింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాలు రావడానికి ఆ తోటలు దోహదం చేస్తున్నాయి. ఇతర పంటలతో పోల్చితే ఎంతో లాభదాయం. శ్రమ, పెట్టుబడి తక్కువగా ఉండడంతోపాటు ఆదాయం ఎక్కువగా వస్తుంది. వర్షాలతో సంబంధం లేకుండా దిగుబడి సాధించవచ్చు.వార్ల కోటేష్ ప్లాంటేషన్ జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీఎం

# పట్టణ పారిశుధ్యం.. పర్యవేక్షణ నామమాత్రం

## బాహ్య వలయం.. కాబోయే అభివృద్ధి నిలయం

హైదరాబాద్ : నగరానికి సమీపంలో కొత్త ఐటీ సంస్థలు, పారిశ్రామికవాడలు ఏర్పాటు చేసేందుకు రంగారెడ్డి జిల్లా పరిశ్రమలు, రెవెన్యూ శాఖలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. శంషాబాద్ విమానాశ్రయానికి 30 కిలోమీటర్లలోపు, బాహ్యవలయ రహదారికి వెలుపల వీటిని స్థాపించేందుకు వీలుగా ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్నారు. శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే చాలామంది పరిశ్రమలు స్థాపించారు. ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలోనే కృత్రిమమేధ నగరం, సెమీ కండక్టర్, టెలీకమ్యూనికేషన్ పరిశ్రమలు కొత్తగా రానున్నాయి.

ఇతర దేశాల ఆసక్తి

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇటీవల అమెరికాలో పర్యటించినప్పుడు కొందరు ఎన్ఆర్ఐలు, తెలంగాణకు చెందిన యువ పారిశ్రామికవేత్తలను కలిశారు. వారిలో చాలామంది హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం కనబరిచారు. వీరితో పాటు జర్మనీ, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా దేశాలకు చెందిన ఆటోమొబైల్ కంపెనీలు రంగారెడ్డి జిల్లాలోని పారిశ్రామికవాడల్లో కొత్త యూనిట్ల



ఏర్పాటుకు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాయి. తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన టెక్స్‌టైల్స్ పరిశ్రమలు అనుబంధ యూనిట్లను స్థాపించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి.

ఫార్మాసిటీ భూముల్లో ప్రత్యామ్నాయాలు

హైదరాబాద్‌కు సమీపంలోని యాచారం, కందుకూరు మండలాల్లో 1933 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమికంగా ఏర్పాట్లు పూర్తవుతుండగా ప్రభుత్వం మారిపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఫార్మాసిటీని మరోచోట ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో సేకరించిన భూముల్లో వివాదాస్పదంగా ఉన్నవి, కోర్టు కేసుల్లో చిక్కుకున్న వాటిని మినహాయించి మిగిలిన భూముల్లో ప్రత్యామ్నాయంగా ఐటీ సంస్థలు, పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు వీలుంటుందా? అన్న అంశాలపై అధికారులు యోచిస్తున్నారు. ఫార్మాసిటీ తరలింపుపై అధికారికంగా ఇంకా ఉత్తర్వులు రాకపోవడంతో రెవెన్యూ, పరిశ్రమలశాఖల అధికారులు ప్రస్తుత పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నారు. రహదారులు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తున్నారు.

## మెరుగుపడాలంటే.. ఈ అడుగులు పడాలంతే..!

ఖమ్మం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై పర్యవేక్షణ మరింత పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు సర్కారు ఉపక్రమించింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా 'యాప్' రూపొందించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను పటిష్ఠపరచాలని భావిస్తోంది. ప్రస్తుతం డిగ్రీ కళాశాలల్లో అమలవుతున్న ఈ విధానాన్ని జూనియర్ కళాశాలల్లోనూ పాటించాలని ప్రభుత్వం యోచిస్తోంది. రోజూ ఎంతమంది విద్యార్థులు, అధ్యాపకులు కళాశాలకు వస్తున్నారు, బోధించిన పాఠ్యాంశాలు, టీచింగ్ డైరీ, నోట్స్ తయారీ, కళాశాలలను ప్రిన్సిపల్స్ ఎలా నిర్వహిస్తున్నారనే అంశాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయి అధికారులైన కమిషనర్, ఆర్‌జేడీకి పూర్తి వివరాలు తెలుస్తాయి. తద్వారా పర్యవేక్షణ మరింత మెరుగుపడుతుంది. ఇదే యాప్‌లో కళాశాలల భవనాలు, అధ్యాపకుల ఖాళీలు, ఇతర వివరాలను సైతం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశముంటుంది. గతంలో ఈ సమాచారాన్ని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు సంబంధిత కళాశాలల ద్వారా సేకరించి, జిల్లా కార్యాలయం ద్వారా ఇంటర్ బోర్డుకు మ్యానువల్‌గా పంపేవారు.

ఖమ్మం జిల్లాలోని ముదిగొండ జూనియర్ కళాశాలకు వచ్చే విద్యార్థులకు గతంలో పండ్రేగుపల్లి, పమ్మి నుంచి ఆర్‌టీసీ బస్సులు ఉండేవి. నష్టాలు వస్తున్నాయని రద్దు చేయటంతో ఇప్పుడు విద్యార్థులు కళాశాలకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. తల్లిదండ్రులు బాలికలను పంపలేకపోతున్నారు.




లాభాపేక్ష లేకుండా బస్సులు నడిపితే హాజరుశాతం పెరగొచ్చు.

ప్రతికూలాంశాలను అధిగమించటమెలా..?

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. గురుకులాలు వచ్చిన తర్వాత వీటి ప్రభావం మరింత ఎక్కువైంది. నగరాలు, పట్టణాల్లో వసతిగృహాలు ఉండటంతో ప్రవేశాల సంఖ్య కొంతమేర ఆశాజనకంగా కనిపిస్తున్నా మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా తయారవుతోంది. చాలామంది పిల్లలు వ్యవసాయ, కూలీ పనులు చేసుకుంటూ చదువుకుంటున్నారు. కళాశాలలకు రెగ్యులర్‌గా రాలేకపోతున్నారు. హాజరు 60-75 శాతం కన్నా తక్కువగా నమోదవుతోంది. పరీక్ష రుసుము చెల్లించిన తర్వాత నేరుగా హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. కళాశాలకు వెళ్లకపోయినా పరీక్షలు రాయొచ్చుననే అభిప్రాయం కొంతమంది విద్యార్థుల్లో ఏర్పడుతోంది. కళాశాలల్లో అధ్యాపకులకు బయోమెట్రిక్ హాజరు విధానం అమలవుతోంది. విద్యార్థులకు మాత్రం అమలవటం లేదు. ఇలాంటి సమస్యలను ఎలా అధిగమించాలనే అంశంపై ఇంటర్ బోర్డు అధికారులు ఎలాంటి సలహాలు, సూచనలిస్తారోనని ప్రిన్సిపల్స్, అధ్యాపకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రత్యేక యాప్ రూపొందించే అంశం పరిశీలనలో ఉంది. దీనిపై ప్రిన్సిపల్స్, అధ్యాపకుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల్లో దీనికి సంబంధించిన విధానాలు ఖరారయ్యే అవకాశముంది. కె. రవిబాబు, డీఐఈఓ, ఖమ్మం



పరిగి : వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు ప్రబలుతాయి. ఇందుకు పారిశుద్ధ్య లోపం ప్రధాన కారణంగా నిలుస్తోంది. ముఖ్యంగా పట్టణాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. లేదంటే దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అంటువ్యాధుల బారిన పడతారు. జిల్లాలో కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీలున్నాయి. ప్రస్తుతం వర్షాలు అనుకున్న స్థాయిలో పడకున్నా వీధుల శుభ్రత, మురుగు కాలువల్లో దోమల వ్యాప్తి నివారణ మందులు చల్లడం వంటివి నిరంతరం సాగాలి. ఈ కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో అనుకున్నంతగా సాగడంలేదు. దీనికి సంబంధించి కథనం.

కొంత మేర ముందస్తు చర్యలు

తాండూరు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో అధికారులు కొంతమేర ముందస్తు చర్యలు చేపట్టారు. వీధుల్లో పేరుకు పోయిన చెత్త కుప్పలు తొలగిస్తున్నారు. మురుగు కాల్వల్ని శుభ్రం చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగు నీటిలో దోమలు వ్యాప్తి చెందకుండా మలాథియాన్ ద్రావణాన్ని పిచికారీ చేయడంతోపాటు బ్లీచింగ్ పౌడరు చల్లుతున్నారు. పట్టణంలో రోజుకు 42 మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్త వెలువడుతోంది.

అవగాహన కల్పించారు.. తరువాత వదిలేశారు

వికారాబాద్ మున్సిపాలిటీలో గతేడాది వర్షాకాలంలో పట్టణ ప్రజలు రకరకాల జబ్బులతో ఆసుపత్రులకు బారిన పడ్డారు. ఇటీవల పుర అధ్యక్షురాలు మంజుల అధ్యక్షతన మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు. గత అనుభవాలను గుర్తుంచుకుని సీజనల్ వ్యాధులపై పుర సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత క్షేత్ర స్థాయిలో తీసుకున్న చర్యలు మాత్రం కనిపించటం లేదు. కాల్వల్లో మురుగును తీసి పక్క రోడ్డుపైనే పడేస్తున్నారు. రోజుల తరబడి అలాగే వదిలేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మంచి నీటి ట్యాంక్‌ల వద్ద అపరిశుభ్రత నెలకొంది. ప్రతిరోజూ 30 టన్నుల చెత్త పట్టణం నుంచి వెలువడుతుంటే తరలించేందుకు 16 వాహనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

ఎక్కడపడితే అక్కడే వ్యర్థాల పారబోత

పరిగి పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు పారబోయడం, సకాలంలో స్వచ్ఛ పనులు చేపట్టకపోవడంతో పరిసరాలు దుర్గంధంతో ఇబ్బంది పెడుతున్నాయి. దీనికి తోడు మురుగు కాల్వలు సరిగ్గా లేవు. ప్రైవేట్ ప్లాట్లలో మురుగునీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. దీంతో రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. పట్టణంలో నిత్యం సుమారు 8నుంచి10 టన్నుల చెత్త సేకరణ జరుగుతున్నా పరిస్థితులు మెరుగు పడటం లేదు. వార్డు అధికారుల పర్యవేక్షణ కొరవడింది. మురుగు కాల్వల నుంచి సాఫీగా ముందుకు పారడంలేదు.

అరకొరగా మురుగు కాలువల నిర్మాణాలుకొడంగల్ మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో మురుగు కాల్వల నిర్మాణాలు తగినంతగా లేక రహదారులపైనే మురుగు పారుతోంది. వర్షాలు పడితే పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంటోంది. కార్గిల్, శాంతినగర్, సన్‌సిటీ కాలనీల్లో నూతన ఇళ్లు నిర్మితమైనా అందుకు తగ్గట్లు మురుగు కాల్వ వ్యవస్థ విస్తరించలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. రోజుకు 2 టన్నుల చెత్త వెలువడుతుండగా తరలించేందుకు పారిశుద్ధ్య సిబ్బంది తగిన స్థాయిలో నియామకం కాలేదు.

## క్రమబద్ధీకరణ కుంభకోణంపై నజర్




పరిగి : మహానగరంలో జీవో 59 కింద జరిగిన భూముల క్రమబద్ధీకరణ కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించబోతోంది. దీనిపై ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతోనూ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తరువాత ఆదేశాలు వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఉత్తర్వును ఆసరాగా చేసుకొని..

విచారణలో రూ.వేల కోట్ల భూముల క్రమబద్ధీకరణ అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గతేడాది జనవరి నుంచి మార్చి వరకు భూముల క్రమబద్ధీకరణకు జీవో నంబర్ 59ను ప్రభుత్వం విడుదల చేసింది. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో రేకుల షెడ్లు లేదా సెమీ పర్మినెంట్ భవనం ఉంటే మార్కెట్ రేటుకు రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలనేది దీని ఉద్దేశం. 2014 -16 మధ్య ఒకసారి, 2022 మార్చి నుంచి అదే నెల చివరి వరకు ఒకసారి ఇలానే అవకాశం ఇచ్చారు. ఆ రెండుసార్లు కంటే గతేడాది జరిగిన క్రమబద్ధీకరణలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని చెబుతున్నారు. 2023లో మూడు నెలల వ్యవధిలోనే రంగారెడ్డి జిల్లాలో 1951 ఎకరాలు, మేడ్చల్ జిల్లాలో 845 ఎకరాలు ఇలాగే క్రమబద్ధీకరించారు. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.10 వేల కోట్ల పై మాటేనని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ భూముల్లో రాత్రిరాత్రికి భవనాలు నిర్మించి ఎప్పటినుంచో ఉన్నట్లు నమ్మించారు. కొన్నిచోట్ల భవనాలు లేకపోయినా ఎకరం నుంచి పదెకరాల వరకు ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించారు. మండల, డివిజన్ స్థాయి అధికారులు సంబంధిత వ్యక్తులతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో అధికార పార్టీ నేతలు కొందరు ఇందులో భాగమయ్యారని చెబుతున్నారు. మంత్రి పొంగులేటి మాత్రం దీనిపై విచారణ చేయించాలనే పట్టుదలతో ఉన్నారు.

ఇవీ అక్రమాలు శేరిలింగపల్లి మండలం పరిధిలో ఈ జీవో కింద 450 ఎకరాలను క్రమబద్ధీకరించారు. ఇందులో కనీసం 150 ఎకరాల వరకు అనర్హులు పేరుతో క్రమబద్ధీకరణ జరిగినట్లు చెబుతున్నారు.

శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీని ఖరీదు దాదాపు రూ.500 కోట్లు. ఈ మొత్తం భూమిని జీవో59 కింద అడ్డుగోలుగా కొద్ది మంది క్రమబద్ధీకరణ చేశారు. ఈ వ్యవహారం వెనుక అప్పట్లో ఒక మంత్రి ఉన్నారని ప్రచారం జరిగింది. నానక్‌రామ్‌గూడలో ఇదే తరహాలో మరో అయిదు ఎకరాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. : గోపనపల్లిలో రూ.140 కోట్ల విలువైన రెండెకరాల ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని ఒక వ్యక్తికి క్రమబద్ధీకరణ చేశారు. ఎటువంటి భవనాలు లేవని స్థానికులు అధికారులు దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదు. ఖాజాగూడలో మరో ఎకరా ప్రభుత్వ భూమి ఇలానే పరుల పరమైంది.

## ఎయిర్‌టెక్ యంత్రాల జాడెక్కడ?

హైదరాబాద్ : ఈ ఫొటో చూశారా.. పంజాగుట్ట ప్రధాన రహదారిపై పరిస్థితి. ఇలా వాన పడిందో లేదో అలా మురుగు మ్యాన్‌హోల్ నుంచి తన్నుకొచ్చింది. ఈ ప్రాంతంలో ఎక్కువగా హోటళ్లు, వాణిజ్య సముదాయాలు ఉండటంతో చెత్తాచెదారం అందులోకి చేరుతోంది. మురుగు పైపులకు అవి అడ్డం పడుతున్నాయి. పంజాగుట్ట నుంచి నాగార్జునసర్కిల్ మధ్యలోనూ నిత్యం మురుగు ముంచెత్తుతోంది. మ్యాన్‌హోళ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలోనే నిత్యం వీఐపీలు రాకపోకలు సాగిస్తుంటారు. మాత్రం చలనం కనిపించడం లేదు.

కేవలం ఇక్కడే కాదు... గ్రేటర్ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గతంలో మాన్యువల్ పద్ధతిలో సీవరేజ్ లైన్లు, మ్యాన్‌హోళ్లు శుభ్రం చేసేవారు. 2016 నుంచి పారిశుద్ధ్య కార్మికులు మ్యాన్‌హోళ్లలోకి దిగకుండా జలమండలి నిషేధించింది. దేశంలోనే మొదటిసారిగా 2017లో మినీ సివర్ జెట్టింగ్ యంత్రాలను ఆవిష్కరించింది. ప్రస్తుతం గ్రేటర్‌వ్యాప్తంగా పెద్ద, చిన్న యంత్రాలు కలిపి 225 వరకు అందుబాటులో ఉన్నాయి. వీటికి ఏటా రూ.15 కోట్లవరకు అద్దె కింద బిల్లులు చెల్లిస్తున్నారు. వీటి పనితీరుపై మాత్రం పర్యవేక్షణ లోపించింది.

నెలకు 30 వేల పైనే ఫిర్యాదులు

గ్రేటర్ వ్యాప్తంగా ఎక్కడ మురుగు పొంగినా సరే.. జలమండలి కస్టమర్ కేర్ 155313కు ఫోన్ చేసి ఫిర్యాదుచేసే వీలుంది. ఇలా నెలకు 30-40 వేల ఫిర్యాదులు మురుగు సంబంధిత సమస్యలపైనే వస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో 2-3 రోజులకు కూడా ఈ యంత్రాలు రావడం లేదంటున్నారు. ఒక్కో డివిజన్‌కు నాలుగు వంతున యంత్రాలను కేటాయించినా ఆయా ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల శుభ్రతలో జాప్యం జరుగుతోంది.కలుషిత నీటి ముప్పుచాలా ప్రాంతాల్లో మురుగు పొంగడంతో కలుషిత నీటి ముప్పు పొంచిఉంది. ప్రధాన నగరంలో ఇంకా నిజాం నాటి మురుగు, పైపులైన్ల వ్యవస్థే ఆధారం. చాలా ప్రాంతాల్లో మురుగు నీటి పైపుల కిందనుంచి మంచినీటి పైపులు వెళుతున్నాయి. లీకేజీలతో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. ఖైరతాబాద్, నాంపల్లి, అమీర్‌పేట్, ముషీరాబాద్, భోలక్‌పూర్, గాంధీనగర్, సికింద్రాబాద్, మలక్‌పేట్ ప్రాంతాల్లో ఈ సమస్య నిత్యకృత్యం.

## సూక్ష్మసేద్యం.. లాభదాయకం..!

ఖమ్మం: పెట్టుబడి ఖర్చులు పెరుగుతుండటం, అధిక నీటి వినియోగం, ఏటికేడు దిగుబడులు తగ్గుతుండటం వంటి పరిస్థితులు అన్నదాతలకు భారంగా మారుతున్నాయి. ఈనేపథ్యంలో సూక్ష్మసేద్యం ద్వారా అధికాదాయం పొందవచ్చునని ప్రభుత్వం చెబుతోంది. డ్రిప్ సాగును రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 లక్షల ఎకరాలకు విస్తరించాలని వ్యవసాయశాఖ అధికారులకు తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

ఉభయ జిల్లాల్లో..

రాష్ట్రవ్యాప్తంగా గతంలో పామాయిల్ సాగుకు మాత్రమే డ్రిప్ విధానం అమలయ్యేది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక డ్రిప్ విధానంపై ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డితో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్చించి వ్యవసాయ, ఉద్యాన పంటలన్నింటికీ 2024-25 వానాకాలం నుంచే డ్రిప్ విధానం అమలుచేయాలని నిర్ణయించారు. మిర్చి, పత్తి, మొక్కజొన్న, మామిడి, బొప్పాయి, అరటి, జామ, నిమ్మ, బత్తాయి, దానిమ్మ, ద్రాక్ష, ఆయిల్‌పామ్, చెరకు,



కూరగాయ పంటలు, పూల సాగుకు డ్రిప్ విధానం అమలుకానుంది. ఖమ్మం జిల్లాలో 1,97,00 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,69,000 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఈ సీజన్‌లో ఉభయ జిల్లాల్లో 20 వేల ఎకరాల్లో కొత్తగా డ్రిప్ విధానం ద్వారా పంటల సాగు చేపట్టాలని వ్యవసాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. డ్రిప్ విధానం ద్వారా పంటల సాగు విస్తీర్ణాన్ని క్రమేణా పెంచాలని భావిస్తోంది.

రాయితీలు ఇలా..ఎస్సీ, ఎస్టీ రైతులకు పూర్తిగా ఉచితంగా అంటే 100 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలను ప్రభుత్వం అందజేస్తోంది. బీసీ, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ వర్తిస్తుంది. ఈవిధానంలో పంటల సాగును బట్టి ఒక్కో యూనిట్ ధర ప్రతి హెక్టారుకు రూ.33,500 నుంచి రూ.1,44,000 వరకు రాయితీ అందుతుంది. ఉభయ జిల్లాల్లో ఇప్పటివరకు డ్రిప్ పరికరాల కోసం సుమారు 16వేల దరఖాస్తులు వచ్చాయని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. డ్రిప్ విధానం ద్వారా 50 శాతం నీటి ఆదాతోపాటు ఎరువులపై ఖర్చు, కూలీల ఖర్చు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. 30- 40శాతం దిగుబడి పెరుగుతుందంటున్నారు. డ్రిప్ సౌకర్యం కల్పించేందుకు ఎనిమిది కంపెనీలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వీటిలో ఇష్టమైన కంపెనీ నుంచి డ్రిప్ పరికరాలను పొందే వెసులుబాటు రైతులకు ఉంటుంది.

సూక్ష్మసేద్యం వైపు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోంది. డ్రిప్ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కర్షకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. సూక్ష్మసేద్యం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చు.- బి.వి.రమణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి, ఖమ్మం

## సమస్యల్లో పెద్దాసుపత్రి

హైదరాబాద్ : నగరంలోని ఉస్మానియా ఆసుపత్రిలో తీవ్ర స్థాయిలో స్థలాభావం వెంటాడుతోంది. పడకలు లేక రోగులను నేలపై పడుకోబెట్టి చికిత్స చేయడం తప్ప.. ప్రత్యామ్నాయ పరిస్థితి కన్పించడం లేదు. పాత భవనం స్థానంలో కొత్తది నిర్మిస్తామని పదేళ్లుగా ప్రణాళికలే తప్ప...అడుగు ముందుకు పడటం లేదు. నేడూ రేపు అంటూనే కాలం వెళ్లదీయడంతో ఆ ప్రభావం పేద రోగులపై పడుతోంది. నిత్యం 1200-1500 మంది ఆసుపత్రిలో ఓపీ కోసం వస్తుంటారు. నిత్యం 250 మంది వరకు ఆసుపత్రిలో వివిధ చికిత్సల కోసం చేరుతుంటారు. చిన్న పెద్ద కలిపి 100-120 వరకు సర్జరీలు నిర్వహిస్తుంటారు. పాత భవనంలో రోగులకు చికిత్స అందించనంత కాలం స్థల సమస్య పెద్దగా ఉండేది కాదు. ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఏడేళ్ల క్రితం మూసివేశారు. అక్కడ ఉన్న 400 పడకలు, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లను కుతుబ్‌షాహి భవనంలోకి, ఓపీలో కొంత సర్దుబాటు చేశారు. కుతుబ్‌షాహి భవనం పైఅంతస్తులో తాత్కాలికంగా షెడ్లు వేసి అక్కడ కొందరికి చికిత్స అందిస్తున్నారు. అయితే ఏయేటికాయేడు రోగుల తాకిడి పెరగడంతో అక్కడా స్థలం సరిపోవడం లేదు. దీంతో రోగులు కటిక నేలపై పడుకోబెట్టి చికిత్స అందిస్తున్నారు. పాత భవనం వారసత్వ కట్టడాల పరిధిలో ఉండటం వల్ల కూల్చివేయడంపై వివాదం నడుస్తోంది. అయితే ఈ భవనం స్థానంలో ఆసుపత్రి ప్రాంగణంలోని ధోబీఘాట్ వద్ద రెండు టవర్లు నిర్మిస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మరోవైపు ఏడేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో పాత భవనం కూలే దశకు చేరుకుంది.

## కొత్త ఉద్యానాలు వస్తున్నాయ్

హైదరాబాద్: మహానగరంలో వాయు కాలుష్యం పెరుగుతున్న దృష్ట్యా మరింత పచ్చదనం పెంపునకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా మరో 29 ఉద్యానాల నిర్మాణానికి అడుగులు పడుతు న్నాయి. దీని కోసం రూ.46 కోట్లు వెచ్చించడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. గ్లోబల్ ర్యాంకింగ్‌లో హైదరాబాద్ 12.9 శాతం పచ్చదనంతో ఉండగా.. దీనిని 33 శాతం పెంచాలనేది హెచ్ఎండీఏ తాజా ప్రణాళిక. దీనిలో భాగంగా గ్రేటర్ వ్యాప్తంగా కొత్తగా 29 పార్కులను తీర్చిదిద్దనున్నారు. శంషాబాద్‌లో 30 ఎకరాలు, తెల్లాపూర్‌లో 20, శివార్లలో మరో 20 ఎకరాల్లో పార్కులను చేపట్టనున్నారు.

కొత్త కాలనీల్లోనూ...: మహానగర వ్యాప్తంగా అనేక కొత్త కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు పుట్టుకొస్తున్నా.. చాలా ప్రాంతాల్లో పచ్చదనం ఉండటం లేదు. మరోవైపు భారీగా వాహనాలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో పచ్చదనానికి పెద్దపీట వేసేలా శివార్లలో విస్తరిస్తున్న కొత్త కొత్త కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఉద్యానాలు అభివృద్ధి చేయనున్నారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే 26 ప్రాంతాలను గుర్తించి అక్కడ 2 నుంచి 5 ఎకరాల్లో వీటిని తీర్చిదిద్దనున్నారు. పెద్ద గేటెడ్ కమ్యూనిటీల్లో పార్కుల కోసం కొంత స్థలం కేటాయించాల్సి ఉన్నా.. చాలామంది తర్వాత వీటిని కూడా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాంటి చోట్ల పచ్చదనం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోనున్నారు.మరిన్ని ఫారెస్టు బ్లాకుల అభివృద్ధి

కొత్త పార్కులకు తోడు శివార్లలో గుర్తించిన ఖాళీ ప్రదేశాలు...రోడ్ల వెంట, పరిశోధన సంస్థలు, ప్రభుత్వ స్థలాల్లో కొత్త ఫారెస్టు బ్లాక్‌లను తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలో 17 ఫారెస్టు బ్లాకులు ఉన్నాయి. హిమాయత్‌సాగర్ పరిధి కొత్వాల్‌గూడలో 150 ఎకరాల్లో ఎకో పార్కుతోపాటు కొత్త ఫారెస్టు బ్లాక్‌ను అభివృద్ధి చేస్తున్నారు.




# లంగా ఓణీలో రాములమ్మ..!

తెలుగు బుల్లి తెరపై సుదీర్ఘ కాలంగా యాంకర్స్ గా వినోదాన్ని పంచుతున్న వారిలో సుమ ముందు ఉండగా, ఆ తర్వాత స్థానంలో శ్రీముఖి ఉంటుంది అనడంలో సందేహం లేదు. గతంలో ఉదయ భాను అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేది. ఇప్పుడు ఆ స్థాయిలో శ్రీముఖి బుల్లి తెర ద్వారా ప్రేక్షకులను వివిధ కార్యక్రమాల ద్వారా అలరిస్తూ వస్తుంది. అప్పుడప్పుడు వెండి తెరపై కూడా మెరవడం ద్వారా నటిగా మంచి మార్కులు దక్కించుకుంది. హీరోయిన్ గా చేయాలనే కోరిక ఉన్నా కూడా అందుకు తగ్గ మంచి పాత్రలు ఈ అమ్మడికి దక్కలేదు. హీరోయిన్స్ సైతం దక్కించుకోలేని మాస్ ఫాలోయింగ్ ను, సోషల్ మీడియా ఫాలోయింగ్ ను శ్రీముఖి బుల్లి తెర ద్వారా సొంతం చేసుకుంది. హీరోయిన్స్ స్థాయిలో సోషల్ మీడియాలో తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉండటం వల్ల భారీ ఎత్తున ఫాలోవర్స్ ను కూడా సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఇన్ స్టా లో శ్రీముఖి ని ఫాలో అయ్యే వారు దాదాపుగా అయిదు మిలియన్ల మంది ఉన్నారు. చాలా మంది సౌత్ హీరోయిన్స్ కి ఉన్న ఫాలోవర్స్ కంటే కూడా శ్రీముఖి సోషల్ మీడియా ఫాలోవర్స్ సంఖ్య ఎక్కువ. అందుకే తన ఫాలోవర్స్ కోసం రెగ్యులర్ గా అందమైన



ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి బుల్లి తెర రాములమ్మ అందమైన లంగా ఓణీ ఫోటోలను షేర్ చేసింది. ఆకట్టుకునే లుక్ లో శ్రీముఖి షేర్ చేసిన ఈ ఫోటోలు అన్ని వర్గాల వారిని ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం ఫోటోలు మరియు వీడియోలు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తున్న రాములమ్మ ముందు ముందు అయినా సినిమాల్లో బిజీ అవ్వాలని ఫ్యాన్స్ మరియు ప్రేక్షకులు కోరుకుంటున్నారు. ఈ ఔట్ ఫిట్ లో రాములమ్మ నిజంగా చాలా అందంగా ఉందని, గతంతో పోల్చితే సన్నగా నాజూకుగా కనిపిస్తుందని నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక శ్రీముఖి బిగ్ బాస్ లో కూడా సందడి చేసిన విషయం తెల్సిందే. ఇప్పటి వరకు అత్యధిక పారితోషికం తీసుకున్న బిగ్ బాస్ కంటెస్టెంట్ అంటూ శ్రీముఖి కి పేరు ఉంది. అంతటి గుర్తింపు దక్కించుకున్న శ్రీముఖి ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో అంతకు మించి అన్నట్లుగా ఇలాంటి ఫోటోలతో హల్ చల్ చేస్తోంది. ఆకట్టుకునే అందంతో పాటు, హీరోయిన్స్ స్థాయి ఎక్స్ ప్రెషన్స్ ఇచ్చే శ్రీముఖి లంగా ఓణీ లో భలే ఉందే అంటూ నెటిజన్స్ తో పాటు మీడియా వర్గాల వారు మరియు బుల్లి తెర ప్రేక్షకులు ఈ ఫోటోలకు కామెంట్స్ చేస్తున్నారు.

# రాయ్ లక్ష్మి రంజు రంజు లుక్!

రాయ్ లక్ష్మి టాలీవుడ్ కి దూరమై ఐదేళ్లు అవుతుంది. కంబ్యాక్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసింది గానీ పనవ్వలేదు. టాలీవుడ్ అనే కాదు..కోలీవుడ్..శాండిల్ వుడ్..మాలీవుడ్, బాలీవుడ్ ఇలా అన్ని భాషల్లోనూ కొన్ని సినిమాలు చేసింది. కానీ ఏ భాషలోనూ నిలదొక్కుకోలేదు. స్థిరమైన అవకాశాలు లేకపోవడంతో ఇలా అన్ని పరిశ్రమలో గుమ్మం తొక్కాల్సి వచ్చింది. ఈ ఐదేళ్ల కాలంలో బిజీగా ఉంది ఎప్పుడుంటే? 2019 లోనే. ఆ ఏడాదే అమ్మడు నటించిన ఐదారు సినిమాలు రిలీజ్ అయ్యాయి. ఆ తర్వాత ఏడాదికి ఒకటి రెండు చొప్పున చేసింది. కానీ వాటిలో ఏది చెప్పుకోదగ్గ చిత్రం కాదు. ప్యాడింగ్ ఉన్న సినిమాలు కూడా సరిగ్గా ఆడలేదు. దీంతో ప్రస్తుతం మాలీవుడ్ లోనే ఓ సినిమా చేస్తుంది. కెరీర్ పరంగా రాయ్ లక్ష్మి ప్రయాణం అలా సాగుతుంది. అయితే నెట్టింట మాత్రం అభిమానులకు



నిత్యం టచ్ లోనే ఉంటుంది. హాట్ హాట్ ఫోటోలతో హీటెక్కించడం అమ్మడి ప్రత్యేకత. ఇది రాయ్ లక్ష్మిలో మొదటి నుంచి ఉన్న క్వాలిటీ. సినిమాల సంఖ్య తక్కువగా ఉన్నా? ఇంకా యూత్ లో అటెన్షన్ డ్రా చేస్తుందంటే? కారణం ఆరకమైన ఫాలోయింగ్ అన్నది చెప్పొచ్చు. తాజాగా అమ్మడు స్విమ్మింగ్ పూల్ నుంచి ఓ హాట్ ఫోటో వదిలింది. ఇందులో అమ్మడు రెడ్ అండ్ వైట్ కాంబినేషన్ పీస్ లు ధరించి పూల్ మధ్యలో బుక్ పట్టుకుని సీరియస్ గా చదివేస్తుంది. చదవడంలో ఆ సీరియస్ చూసి ఈవిడేమైనా బోర్డ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్ అవుతుందా? అన్న డౌట్ రావడం సహజం. అలా అనుకుంటారనే అమ్మడు ఈ ఫోటోని ఉద్దేశించి ఓ క్యాప్షన్ కూడా ఇచ్చేసింది.నా జీవితంలోని ఈ అధ్యాయాన్ని ఆనందం అంటారు అని రాసుకొచ్చింది. అంటే ఈత కొలనులో ఇలా రిలాక్స్ అవుతోన్న సమయంలోనే అమ్మడు అంత ఆనందంగా ఉంటుందని..మిగతా క్షణాలన్నీ లైఫ్ బిజీ టెన్షన్ లోనే ఉంటానని చెప్పకనే చెప్పింది.

# 11 రోజుల్లో దేవర సెంచరీ...!




ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక 'దేవర' మూవీ నుంచి 11 రోజుల క్రితం సెకండ్ సింగల్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి పాటకు మాస్ ఆడియన్స్ నుంచి వచ్చిన స్పందన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ పాటకు ఎన్టీఆర్ అభిమానులు ఉర్రూతలూగి పోయారు. ఇప్పుడు చుట్టమల్లె అంటూ వచ్చిన పాటకి మంచి స్పందన వస్తోంది. ఇప్పటికే యూట్యూబ్ లో ఈ పాట రికార్డ్ స్థాయి వ్యూస్ దక్కాయి. భారీ ఎత్తున వస్తున్న వ్యూస్ తో దేవర సరికొత్త రికార్డులను సృష్టించబోతుంది. తక్కువ సమయంలోనే 50 మిలియన్ ల వ్యూస్ ను, 75 మిలియన్ ల వ్యూస్ ను సొంతం చేసుకున్న దేవర సెకండ్ సింగిల్ 11 రోజులు కూడా పూర్తి అవ్వకుండానే ఏకంగా 100 మిలియన్ ల వ్యూస్ ను సొంతం చేసుకుంది. సాధారణంగా హిందీ మ్యూజిక్ ఆల్బమ్స్ లేదా బాలీవుడ్ సినిమా పాటలు ఇలా భారీ వ్యూస్ ను సొంతం చేసుకోవడం జరుగుతుంది. సౌత్ సినిమా పాటలు ఇంత స్పీడ్ గా వంద మిలియన్ ల వ్యూస్ ను సొంతం చేసుకోవడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. ఇప్పుడు దేవర సినిమా పాట అంతకు మించి అంటూ దక్కించుకుంటున్న వ్యూస్ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ మధ్య కాలంలో సినిమాలు విడుదల అయిన తర్వాత పాటలకు మంచి క్రేజ్ క్రియేట్ అయ్యి ఎక్కువ వ్యూస్ వస్తున్నాయి. కానీ దేవర సాంగ్స్ కి మాత్రం విడుదలకు ముందే ఓ రేంజ్ లో ఆధరణ లభిస్తుంది. చుట్టమల్లె పాటకు దక్కిన స్పందన చూస్తూ ఉంటే సినిమా కచ్చితంగా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకం కలుగుతుందని ఎన్టీఆర్ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఎన్టీఆర్ గతంలో చేసిన సినిమాలన్ని రికార్డులను ఈ సినిమా బ్రేక్ చేసే విధంగా ఓపెనింగ్ కలెక్షన్స్ ఉంటాయని ఫ్యాన్స్ చాలా నమ్మకంతో కనిపిస్తున్నారు.

అనిరుధ్ అందించిన ఈ పాట మ్యూజిక్ విషయంలో మొదట ట్రోల్స్ వచ్చినా వాటన్నింటిని దాటుకుని, ఆ ట్రోల్స్ వల్ల మరింతగా వ్యూస్ ను రాబట్టుకుంటూ దూసుకు పోతుంది. యూట్యూబ్ లో అత్యధిక వ్యూస్ ను రాబట్టడంతో పాటు, లైక్స్ మరియు షేర్స్ ను కూడా ఈ పాట దక్కించుకోబోతుంది. కేవలం యూట్యూబ్ లోనే కాకుండా పలు పాటల స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్ పై కూడా ఈ పాటలు సందడి చేస్తున్నాయి. ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్ తర్వాత చేస్తున్న సినిమా ఇదే అవ్వడంతో ఆ స్థాయిలో ఉంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. కొరటాల శివ చాలా సమయం తీసుకుని ఈ సినిమాను చేస్తున్నాడు. సెప్టెంబర్ 27న ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు.

# శర్మా సిస్టర్స్ సంథింగ్ స్పెషల్




శర్మా సిస్టర్స్ ఎప్పుడు ఎక్కడ ఉన్నా అక్కడ వెలుగు జిలుగులకు కొదవేమీ ఉండదు. నేహా శర్మ -ఐషా శర్మ ఫ్యాషన్ గోల్స్ ని సెట్ చేయడంలో ఎప్పుడూ విఫలం కారు. శుక్రవారం సాయంత్రం ముంబైలో జరిగిన అనంత్ అంబానీ - రాధిక మర్చంట్‌ల వివాహ సంగీత్ వేడుకకు శర్మా సిస్టర్స్ కొత్త కళను తెచ్చారు. ఎంతో స్టైలిష్ గా ఈవెంట్లోకి దూసుకొచ్చిన బాలీవుడ్ సిస్టర్స్ మరోసారి హెడ్ టర్నర్స్‌గా మారారు. రెడ్ కార్పెట్‌పై కెమెరాలకు పోజులిచ్చిన తోబుట్టువులిద్దరూ వెరీ స్పెషల్ గా కనిపించారు. నేహా నల్లటి బ్రాలెట్, రచ్డ్ స్కర్ట్ %డ% ప్రింటెడ్ ష్రగ్‌తో హెడ్ టర్నర్‌గా మారగా.. ఐషా శర్మ మరోవైపు ఈవెంట్ కోసం పీచు-రంగు సంప్రదాయ లెహంగా కాంబినేషన్ చోళీని ధరించింది. నేహా శర్మ- ఐషా సోషల్ మీడియాలలో నిరంతరం అభిమానులకు టచ్‌లో ఉన్నారు.

వారి అందమైన ఫోటో షూట్‌లు.. హాట్ పబ్లిక్ అప్పియరెన్స్‌లతో నిరంతరం ఫ్యాన్స్ ని చిల్ చేస్తున్నారు. జిమ్‌లకు వెళుతూ ఫిట్నెస్ గోల్స్ సెట్ చేయడంలోనే కాదు.. విమానాశ్రయాలలో నిరంతరం కనిపిస్తూ ఎల్లప్పుడూ ఫోటోగ్రాఫర్‌ల దృష్టిని ఆకర్షిస్తున్నారు. సిస్టర్స్ ఫోటోషూట్లు ఆన్‌లైన్‌లో తక్షణమే వైరల్ అవుతున్నాయి. తాజా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ నేహా శర్మ.. కొన్నిసార్లు డి-గ్లామ్ పాత్రలను ఎలా పోషించవలసి వస్తుందో వెల్లడించారు. తెరపైనా తెర వెలుపలా ఆమె ఆకర్షణీయమైన పాత్రలతో మెప్పించిన నేహా కూడా కొన్నిసార్లు తనకు వచ్చిన అవకాశాలను విస్మరించడం గురించి తన ఇమేజ్‌కి వ్యతిరేకంగా ఉండే అవకాశాలు వచ్చినా తిరస్కరించడం వంటివి చేసానని తెలిపింది. పరిశ్రమలో ప్రతిదీ సీరియస్‌గా తీసుకోవాలంటే, మిమ్మల్ని మీరు డి-గ్లామ్ చేసుకోవాలి. మీరు ఒక నిర్దిష్ట మార్గంలో వెళితే.. వారు మిమ్మల్ని చెత్త నటులు అంటారు. ఇది కేవలం మూస ఆలోచన మాత్రమేనని నేను భావిస్తున్నాను అని కూడా వ్యాఖ్యానించింది. తాను చాలా అందంగా కనిపించడం కోసం చాలా కోల్పోయానని కూడా నేహా శర్మ అంది. అందంగా ఉన్నావని చెప్పి అవకాశాలు ఇవ్వని నిర్మాతలు ఇక్కడ ఉన్నారు. అయితే ఒక నిర్మాత మేము వెతికే అమ్మాయి నువ్వు కాదు! అని చెప్పి కూడా తర్వాత తనను ఎంపిక చేసుకున్నాడని కూడా నేహా శర్మ గుర్తు చేసుకున్నారు.

# వైట్ సారీలో కీర్తి.. సూపర్ హాట్ బ్యూటీ!

కీర్తి సురేష్ ఆన్ స్క్రీన్ పై గ్లామర్ డోస్ పెంచిన సంగతి తెలిసిందే. పాత్ర పరంగా ఎంత వరకూ నటించాలో? అంతవరకూ పూర్తిగా న్యాయం చేస్తుంది. మునుపటిలా మడికట్టుకుని కూర్చుంటే వచ్చే అవకాశాలు రావని మారిందా? దర్శకుల ఒత్తిడి కారణమా? అన్నది పక్కనబెడితే మార్పు తో కొత్త అవకాశాలు బాగానే అందు కుంటుంది. కొంతవరకూ తనలో ఛేంజోవర్ ప్రొఫెషనల్ గా కలిసొచ్చింది. కానీ ఆఫ్ ది స్క్రీన్ మాత్రం అమ్మడు రూల్స్ ఎక్కడా బ్రేక్ చేయడం లేదు. ఫరిది దాటి గ్లామర్ షో చేస్తు న్నట్లు ఇంతవరకూ ఎక్కడా దొరకలేదు. నెట్టింట షేర్ చేసే ఫోటోల్లో తన కట్టుబాట్లను మాత్రం తూచ తప్పకుండా పాటిస్తూనే ఉంది. అందాలు కనిపించే డ్రెస్ లకంటే డ్రెస్ తోనే అందం తీసుకొచ్చే పాలసీతో ముందుకెళు



తుంది. ఆఫ్ ది స్క్రీన్ లో స్కిన్ షో...క్లీవేజ్ షో వంటి వాటికి తొలి నుంచి దూరంగానే ఉంది. ఇప్పటికీ అదే కండీషన్ తో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడు వైట్ డిజైన్ సారీలో తళుకులీనిన వైనం నెట్టింట చర్చకొచ్చింది. ఇదిగో ఇక్కడిలా వైట్ అండ్ ఫ్లవర్ కాంబినేషన్ సారీలో అమ్మడు ఎంతో అందంగా కనిపిస్తుంది. సారీ మ్యాంచిగా టాప్ పై వైట్ కలర్ షోల్డర్ లెస్ బ్లౌజును ఎంపిక చేసుకుంది. లైట్ మ్యాకప్...స్కిన్ షోతో కుర్రాళ్లను కవ్విస్తుంది. అమ్మడి పెదవిలపై అందమైన నవ్వు మరింత బ్యూటీని తీసుకొచ్చింది. ఇది కీర్తి మార్క్ అప్పిరియన్స్ అనిపించింది. వివిధ భంగిమల్లో కెమెరాకి ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. ఒక్కో భంగిమని ఉద్దేశించి నెటి జనులు కామెంట్లు పెడు తున్నారు. లుక్స్ గార్జియస్, ఎడోరబుల్, క్యూటీ బంగారం , సూపర్ హాట సెన్సేషన్ అంటూ పోస్టులు దర్శనమిస్తున్నాయి.

# ప్రియాంక.. ఓ ఇన్నోసెంట్ పోలీస్!

నేచురల్ స్టార్ నాని గ్యాంగ్ లీడర్ మూవీతో టాలీవుడ్ కు ముద్దుగుమ్మ ప్రియాంక అరుల్ మోహన్ పరిచయమైన విషయం తెలిసిందే. ఫస్ట్ సినిమాతోనే అందరినీ ఆకట్టుకుంది. తక్కువ చిత్రాల్లోనే నటించినా.. తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. కానీ అనుకున్న స్థాయిలో హిట్లు కొట్టలేకపోయింది. దీంతో కోలీవుడ్ కు వెళ్లి వరుస సినిమాల్లో నటిస్తోంది. అక్కడి స్టార్ హీరోలు శివ కార్తికేయన్, ధనుష్ చిత్రాల్లో హీరోయిన్ గా నటించి మెప్పిస్తోంది. అయితే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ సినిమాకు గాను హీరోయిన్ గా ఎంపికై టాప్ ఆఫ్ ది టౌన్ గా మారింది. సాహో ఫేమ్ సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీతో లక్కీ ఛాన్స్ కొట్టేసింది. ఓజీతో పాటు తెలుగులో తన ఫస్ట్ సినిమా హీరో నానితో కూడా వర్క్ చేస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబోలో సరిపోదా శనివారం మూవీ తెరకెక్కుతోంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను డీవీవీ దానయ్య గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినీ ప్రియులతో పాటు నాని ఫ్యాన్స్ లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మేకర్స్ కూడా అందుకు



తగ్గట్లు ప్రమోషన్స్ చేస్తున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న కొద్దీ.. ప్రతి శనివారం ఏదో ఒక అప్డేట్ తో సందడి చేస్తున్నారు. వరుసగా సాంగ్స్, పోస్టర్లు రిలీజ్ చేస్తూ అలరిస్తున్నారు. ఇప్పటికే సినిమాలో నాని.. సూర్యగా కనిపించనున్నట్లు అనౌన్స్ చేశారు మేకర్స్. తాజాగా ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్ ను రివీల్ చేశారు. సినిమాలో చారులతగా ప్రియాంక నటిస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఇన్నోసెంట్ పోలీస్ గా ఆమెను పరిచయం చేశారు. పోలీస్ యూనిఫామ్ ధరించిన అమ్మడు.. భూజానికి బ్యాగ్ వేసుకుని రోడ్డుపై నడుస్తున్నట్లు చూపించారు. ఆమె ముఖంలో చిరునవ్వు అందరినీ ఆకట్టుకుంటోంది. పోలీస్ అధికారి అయినా.. కూల్ గా కనిపిస్తోంది బ్యూటీ. మూవీలో ప్రియాంక పోషిస్తున్న చారులత రోల్ కీలకంగా ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ ద్వారా క్లారిటీ వచ్చేసింది. సరిపోదా శనివారం మూవీని డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి భారీ బడ్జెట్ తో రూపొందిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. ఎస్ జే సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఆగస్టు 29వ తేదీన విడుదల కానున్న ఈ సినిమాతో ప్రియాంక ఎలాంటి హిట్ అందుకుంటుందో చూడాలి.





# గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి పొన్నం రివ్యూ మీటింగ్

హైదరాబాద్, ఆగస్టు 17: మరికొద్దిరోజుల్లో వినాయక చవితి రాబోతోంది. గణేషుడి పండగంటే అందరికీ ఎక్కడలేని ఉత్సహం వస్తుంది. చిన్న వినాయకుడి విగ్రహాల నుంచి భారీ వినాయక విగ్రహాలతో కూడిన మండపాలను వాడ వాడలా ఏర్పాటు చేస్తుంటారు యువత. గణపతి బప్పా మోరియా అంటూ చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఎంతో ఉత్సవాంగా వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో గణేష్ ఉత్సవాలు రాబోతున్న తరుణంలో శనివారం నాడు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. విగ్రహాల ప్రతిష్టాపన నుంచి నిమజ్జనం వరకు ఎక్కడా ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు జారీ చేశారు. మండపాలు ఏర్పాటు చేసుకునే వారంతా పోలీసులకు ఇన్ఫామ్ చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు మట్టి విగ్రహాలు పెట్టాలని మండపాల నిర్వాహకులకు మంత్రి సూచనలు చేశారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నుంచి మట్టి విగ్రహాల పంపిణీపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ, పోలీస్, వాటర్ వర్క్స్, రెవెన్యూ, ఆర్ అండ్ బి తో పాటు ఇతర శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

# మూసీ సుందరీకరణపై ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడితో చర్చించాం: శ్రీధర్‌బాబు



హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు 19 సంస్థలతో రూ.31,500 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పెట్టుబడుల ద్వారా 30,750 ఉద్యోగాలు వచ్చే అవకాశముందన్నారు. "దక్షిణ కొరియాలో దాదాపు 12 సంస్థలతో చర్చలు జరిపాం.

ఏఐ, ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులపై చర్చించాం. మూసీ పునరుజ్జీవం కోసం కొన్ని అధ్యయనాలు చేశాం.

మూసీ సుందరీకరణపై ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడితో చర్చించాం. రాష్ట్రంలో బయోడిజైర్ సిటీని ఏర్పాటు చేయాలని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని కోరాం" అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

# దసరా నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం..




హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష మేరకు రూపుదిద్దుకున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దసరా పండగ నుంచి కోర్సులు ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా దాదాపు 20కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రాథమికంగా ఆరు కోర్సులను ముందుగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు సీఎస్ వివరించారు. స్కిల్ యూనివర్సిటీ ప్రారంభం, విధివిధానాలు, కోర్సుల ప్రారంభం తదితర అంశాలపై ఇవాళ(శనివారం) ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించినట్లు సీఎస్ శాంతి కుమారి వెల్లడించారు.

**ఆ కాలేజీల్లో తరగతులు..** ముచ్చర్ల వద్ద కేటాయించిన 57ఎకరాల స్థలంలో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన విషయాన్ని సీఎస్ గుర్తు చేశారు. నిర్మాణ పనులు ముగిసేంతవరకు తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహిస్తామని శాంతి కుమారి తెలిపారు. తరగతులను ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా, నాక్ లేదా నిథమ్ కళాశాలలో నిర్వహిస్తామని ఆమె చెప్పుకొచ్చారు. ఇప్పటికే విశ్వవిద్యాలయం ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రాను, కో-ఛైర్మన్‌గా శ్రీనివాస సి.రాజును నియమించినట్లు పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దాదాపు 140కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయని, దాదాపు 20కోర్సులను ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు సీఎస్ శాంతి కుమారి వెల్లడించారు.

**కార్పొరేట్ కంపెనీల్లో శిక్షణ..** తొలుత స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులను ప్రారంభిస్తామని సీఎస్ శాంతి కుమారి పేర్కొన్నారు. దేశంలో ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన ఎస్బీఐ, ఎన్‌ఏసీ, డా.రెడ్డి, టీవీఏజీఏ, అదానీ, సీఐఐ కంపెనీలు భాగస్వాములుగా ఉండేందుకు అంగీకరించాయని ఆమె వెల్లడించారు. ఈ సంస్థలు తమ కంపెనీల్లోని వివిధ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ లోగో, వెబ్ సైట్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఆకర్షణీయమైన వేతనంతో ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సీఎస్ శాంతి కుమారి సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, పరిశ్రమల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, జయేశ్ రంజన్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొ.వెంకటరమణ, శ్రీనిరాజు, వీవీఎల్ఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరవుతా: కేటీఆర్

హైదరాబాద్: ఈనెల 24న తెలంగాణ మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరవుతానని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల్లో రాష్ట్రంలో మహిళలపై జరిగిన అన్ని ఘటనల వివరాలు కమిషన్‌కు తెలియజేస్తానని చెప్పారు. బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాత కూడా నోటీసులు ఇచ్చారన్నారు. తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తినని, మహిళా ఎమ్మెల్యేలను సీఎం, కాంగ్రెస్ నేతలు అన్న మాటలను కూడా మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు కేటీఆర్ చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకున్న తెలంగాణ మహిళా కమిషన్ శుక్రవారం ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు వ్యక్తిగతంగా కమిషన్ ముందు హాజరుకావాలని ఆయనకు సూచించింది. ఈ మేరకు కమిషన్ 'ఎక్స్' ద్వారా వెల్లడించింది.



# రాజీనామా చేయాలని హరీశ్‌రావును అడిగితే నాటకాలాడుతున్నారు: ఎంపీ చామల



హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రుణమాఫీ చేశామని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఎందుకు రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు. 2018లో మరోసారి రుణమాఫీ మాట ఇచ్చి మర్చిపోయారని విమర్శించారు. 2023 వరకు రైతులు వారికి గుర్తురాలేదని చెప్పారు. "భారాస హయాంలో మీరిచ్చిన రుణమాఫీ వడ్డీలకు కూడా సరిపోలేదు.

రాజీనామా చేయాలని హరీశ్‌రావును అడిగితే నాటకాలాడుతున్నారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ప్రజలకు మీరు మంచి చేసి ఉంటే ఎన్నికల్లో భారాసను ఎందుకు ఓడించారు? మీ ప్రభుత్వంలో చీకటి జీవోలిచ్చి ఎంత కొల్లగొట్టారో తెలుసుకునేందుకే మాకు నెల రోజులు పట్టింది" అని చామల కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.




# బోర్డు తిప్పేసిన మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ

హైదరాబాద్: మాదాపూర్‌లోని మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. అయ్యప్పసొసైటీలో ఫ్రైడే అప్ కన్సల్టెన్సీ కంపెనీ దాదాపు 200 మంది నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసింది. ఒక్కొక్కరి నుంచి రూ.1.50లక్షల చొప్పున వసూలు చేసి.. శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించింది.

శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్ ఇప్పించినట్టు నమ్మించి జీతాలు ఇవ్వకుండా మోసం చేసింది. కార్యాలయానికి ఉన్న పళంగా తాళం వేయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు శనివారం మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ కంపెనీకి బెంగళూరు, విజయవాడలో కేంద్రాలు ఉన్నట్టు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మాదాపూర్ పోలీసులు తెలిపారు.

# ఎమ్మెల్యేకే భద్రత లేకపోతే.. పౌరులకు భరోసా ఏది?: హరీశ్‌రావు

సిద్దిపేట: తన అధికారిక నివాసంపై అర్ధరాత్రి కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. అర్ధరాత్రి కాంగ్రెస్ నేతల దాడి అన్యాయానికి నిదర్శనమని మండిపడ్డారు. తాళాలు పగులగొట్టి.. ఆస్తులు ధ్వంసం చేయడం అప్రజాస్వామికమన్నారు. దాడిని ఆపకుండా నిందితులకు పోలీసులే రక్షణ కల్పించినట్లుందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేకే భద్రత లేకపోతే.. పౌరులకు భరోసా ఏదని ప్రశ్నించారు. దాడి ఘటనపై డీజీపీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రేమ బజార్‌లో ద్వేషపు దుకాణం నడిపిస్తున్నారు: కేటీఆర్...** దాడి ఘటనపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. సీనియర్ ఎమ్మెల్యేకు ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఎలా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఇలాంటి కక్ష సాధింపులు లేవని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నీచంగా వ్యవహరిస్తోందని చెప్పారు.
ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని.. సరైన సమాధానం చెబుతారన్నారు. మరో పోస్టులో రాహుల్ గాంధీని ట్యాగ్ చేసి.. ఇదేనా మీ కాంగ్రెస్ పాలనలో వచ్చిన మార్పు.. ప్రేమ బజార్‌లో ద్వేషపు దుకాణం నడిపిస్తున్నారని చురకలంటించారు. రాజ్యాంగాన్ని రక్షిస్తున్నానని చెప్పుకొనే వ్యక్తికి ఇవి కనిపించడం లేదా అని కేటీఆర్ నిలదీశారు.



**అసలేం జరిగిందంటే..** సిద్దిపేటలో శుక్రవారం అర్ధరాత్రి హైడ్రామా చోటు చేసుకుంది. హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నేతలు ఫ్లెక్సీలు పెట్టారు. రైతు రుణమాఫీ అయ్యింది.. హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో భారాస శ్రేణులు ఫ్లెక్సీలు తొలగించడానికి వచ్చారు. రోడ్డుపైకి అర్ధరాత్రి భారీగా కాంగ్రెస్, భారాస కార్యకర్తలు చేరుకున్నారు. వారి పోటాపోటీ నినాదాలతో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ వేగవంతం..




హైదరాబాద్: కాళేశ్వరం లిఫ్టుల్లో అవినీతి, అక్రమాలు, నాణ్యతా లోపాలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ వేగవంతం చేసింది. దీని కోసం కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్ శుక్రవారం సాయంత్రమే హైదరాబాద్‌కు చేరుకున్నారు. విచారణ ఆలస్యం కాకూడదని ఆయన రెండు వారాలపాటు నగరంలోనే మకాం వేయనున్నారు. విచారణలో భాగంగా పలువురు అధికారులు, ఇంజినీర్లు, ప్రైవేటు వ్యక్తులకు కమిషన్ ఇప్పటికే సమన్లు జారీ చేసింది. జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వి.ప్రకాశ్ విచారణలో భాగంగా హైదరాబాద్ బీఆర్కే భవన్‌లోని కమిషన్ ఎదుట హాజరయ్యారు. కమిషన్ ఎదుట హాజరై పలు అంశాలపై వివరణ ఇచ్చారు. కమిషన్ విచారణ అనంతరం బయటకు వచ్చిన జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వి.ప్రకాశ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."కమిషన్ అడిగిన ప్రశ్నలు అన్నింటికీ సమాధానం ఇచ్చాను. తెలంగాణ భవిషత్ కోసమే అన్ని ప్రాజెక్టులను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రీ-డిజైన్ చేశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కట్టాలని కేసీఆర్ మదిలో ఉండేది. కానీ మహారాష్ట్ర ఆ ప్రతిపాదనలకు ఒప్పుకోలేదు. స్టోరేజీ లేకపోవడం వల్ల తుమ్మిడిహట్టి నిర్మాణం ఆలోచన ముందుకు వెళ్లలేదు. సీడబ్ల్యూసీ చెప్పినట్లు 164టీఎంసీల్లో 64టీఎంసీలు తెలంగాణవి కాదనే విషయం రిపోర్టుల్లోనే ఉంది. వార్ధా నది బ్యారేజీ రూ.2,500కోట్లతో నిర్మాణం అవుతుంది.. తుమ్మిడిహట్టికి రూ.7,500ఖర్చు అవుతుందని కేసీఆర్ హయాంలో అంచనా వేశాం. 'వి' ఆకారంలో బ్యారేజీ కట్టడం సాధ్యం కాదు కాబట్టే కట్టలేదు. తుమ్మిడిహట్టి వద్ద 54టీఎంసీల నీటి లభ్యతే ఉంటుందని అన్ని ఆధారాలు చూపించాను. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణ, గోదావరి బేసిన్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 17లక్షల ఎకరాలకు నీళ్లు అందించాం. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి అవినీతి జరగలేదు. నేను కమిషన్ ముందు చెప్పిన వాటిని అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని అన్నారు. ఈనెల 26న సాక్ష్యాలతో సహా మళ్లీ కమిషన్ ఎదుట హాజరవుతా" అని చెప్పారు.

# 2029లో రాహుల్ గాంధీ ప్రధాని కావడాన్ని ఎవ్వరూ ఆపలేరు..



సూర్యాపేట: 2029 పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావడాన్ని ఎవ్వరూ ఆపలేరని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నేత కష్టపడి పని చేసి ఆ దిశగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ప్రతి కార్యక్రమాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయాల్సిన బాధ్యత సోషల్ మీడియా సోల్జర్స్‌పై ఉందని ఆయన చెప్పారు. తాను ఇప్పుడే సోషల్ మీడియా గురించి నేర్చుకుంటున్నట్లు మంత్రి చెప్పుకొచ్చారు.

**ప్రధాని మోడీని అడ్డుకున్నాం..** ఈ తరంలో ప్రజలకు చేరువైయేందుకు సోషల్ మీడియా బలమైన సాధనం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోడీ మీడియా సంస్థలను మూసివేశారని, కానీ సోషల్ మీడియాని ఆపలేకపోయారన్నారు. ఆ మాధ్యమం ద్వారానే కాంగ్రెస్ ప్రచారం చేసి బీజేపీ సీట్లు తగ్గేలా చేయగలిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. 2029ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావడానికి దీన్నే ప్రధాన మాధ్యమంగా వాడుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**టికెట్ కష్టమే..!** సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వాళ్లకు పార్టీలో సరైన ప్రాధాన్యత ఉంటుందని మంత్రి అన్నారు. ప్రతి గ్రామానికి, ప్రతి వార్డుకు ఒక సోషల్ మీడియా సోల్జర్‌ని నియమించాలని నేతలకు పిలుపునిచ్చారు. ఇందుకు కాంగ్రెస్ మండల, గ్రామ శాఖల అధ్యక్షులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మహిళలు, మహిళా సంఘాల సభ్యులను సోషల్ మీడియాలో యాక్టివ్ చేయించాలని చెప్పారు. సోషల్ మీడియాపై నాలెడ్జ్ లేకుంటే నేతలకు పార్టీ టికెట్ ఇవ్వడం కష్టమే అని మంత్రి అన్నారు.

**చురుగ్గా ప్రచారం చేయండి..** కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాల్లో తాము చేస్తున్న అభివృద్ధి పనులు ప్రచారం చేయడంలో వెనకపడినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. అభివృద్ధిలో రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలం ఎంత చురుగ్గా ఉన్నామో అదే విధంగా సోషల్ మీడియాలో వాటిని ప్రచారం చేయడంలో స్థానిక నేతలు అంతే చురుగ్గా ఉండాలని మంత్రి ఆదేశించారు. కోదాడు, హుజూర్నగర్ నియోజకవర్గాల్లో ఏ ఒక్క ఎకరం ఎండిపోవడానికి వీల్లేదని, అందుకు ప్రతి లిఫ్ట్‌కు మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

# పనామా చౌరస్తా వద్ద నాలాలోకి దూసుకెళ్లిన మరో కారు

హైదరాబాద్: వనస్థలిపురంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పనామా వద్ద నాలాలోకి కారు దూసుకెళ్లడంతో సకాలంలో, సమయ స్ఫూర్తితో వ్యవహరించి వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు ముగ్గురు చిన్నారులతో సహా ఓ కుటుంబం ప్రాణాలను కాపాడారు. వనస్థలిపురం ట్రాఫిక్ సి.ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన జిల్లా వినోద్ తన భార్య పిల్లలతో కలిసి హయత్ నగర్ నుంచి ఎల్బీనగర్ వైపునకు వర్షం పడుతోన్న సమయంలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో పనామా చౌరస్తా దగ్గరకు రాగానే వరద ఉధృతికి కారు అదుపు తప్పి పక్కనున్న వర్షపు నీటి నాలాలోకి దూసుకొని వెళ్ళింది. అది గమనించిన అక్కడే విధుల్లో ఉన్న వనస్థలిపురం ట్రాఫిక్ కానిస్టేబుళ్లు సైదులు, శ్రీనివాసరావు, సి.ఐ వెంకటేశ్వర్లు సమయ స్ఫూర్తితో వ్యవహరించి కారులో ఉన్న ముగ్గురు చిన్నారులతో సహా కుటుంబము మొత్తాన్ని సురక్షితంగా కాపాడారు.



వరద ఉధృతి తగ్గిన అనంతరం ఎక్స్‌కవేటర్ సహాయంలో కారును నాలా నుంచి బయటకు తీశారు. గురువారం రాత్రి కూడా ఇదే ప్రాంతంలో కారు కొట్టుకుపోయింది. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. కారులో ఉన్న వారిని కాపాడిన సిబ్బందిని అధికారులు అభినందించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com